RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 32 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, జూలై, 18 , 2025 | పేజీలు : 8  వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 32 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, July,18, 2025 | PAGES : 8  RS : 4 /- |




### 150 దేశాలపై 10 లేదా 15 శాతం

## సుంకాలు

**- ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్న ట్రంప్**

వాషింగ్టన్: ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై విరుచుకుపడు తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 150కిపైగా దేశాలపై 10 లేదా15 శాతం సుంకాలు విధించను న్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆయా దేశాలకు సుంకాల రేట్లు తెలియజేస్తూ లేఖలు పంపనున్నట్లు వెల్లడించారు. 150కిపైగా దేశాలకు నోటీసులు పంపిం చనున్నామని,అందులోనే సుంకం రేటు పేర్కొంటామని చెప్పారు. ఈ దేశాలన్నిం టికీ ఒకే విధంగా సుంకాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. అవన్నీ పెద్ద దేశాలు కాదని, తమతో అంతగా వ్యాపారం చేయవని పేర్కొన్నారు.



### కెసిఆర్ కుటుంబం

## కడుపునిండా విషమే

- ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాలా
- కేంద్రంతో చర్చించకుంటే సమస్యలకు పరిష్కారమెలా
- పక్క రాష్ట్ర సిఎంతో చర్చలు జరపకుంటే ఎలా
- కేంద్రమంత్రికిషన్ రెడ్డి లేఖలుకాదు..ప్రణాళికతో రావాలి
- అన్ని కేసులపైనా పక్కా విచారణ జరుగుతోంది
- సిబిఐ పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్న బిజెపి
- తన సవాల్ కెసిఆర్‌కే తప్ప కెటిఆర్‌కు కాదు
- విలన్లు ఎప్పుడూ క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు
- ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,జూలై17 : కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడు తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని.. వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నా మనిచెప్పారు. ఢిల్లీలో కేంద్రమంత్రులతో జరిగిన సమావేశాల అనంతరం మీడి యాతో చిట్‌చాట్‌లో సీఎంరేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పలు అంశా లపై స్పష్టత ఇచ్చారు. తన పాలనపై విమర్శలు చేసే ప్రత్యర్థులపై సూటిగా వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఘాటైన పదజాలంతో ప్రస్తావించారు.



#### గాజాలో ప్రతి 10మంది పిల్లలలో..

### ఒకరికి పోషకాహార

## లోపం

జెరూసలేం : గాజాలో ప్రతి 10 మంది పిల్లలలో ఒకరు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతు న్నారని ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ యు. ఎన్ఆర్.డబ్ల్యూ.ఎ తెలిపింది. ఇది జనవరి 2024 నుండి గాజా క్లినిక్‌లలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 240,000 మంది పిల్లలను పరీక్షించింది. పిల్లలు ఆకలితో అలమ టిస్తున్న పరిస్థితి మానవ నిర్మితమని యు.ఎన్ఆ ర్.డబ్ల్యూ.ఎ చీఫ్ ఫిలిప్ లాజారిని అన్నారు.



### రాష్ట్ర ప్రజలపై సీఎం నితీశ్ కుమార్

## వరాల జల్లు..

- 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ప్రకటించిన ముఖ్యమంత్రి
- ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రత్యేక పోస్టు పెట్టిన సీఎం నితీశ్ కుమార్
- ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఈ ప్రకటన

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఈ ప్రకటన వెలువడింది. ఈ ఏడాది అక్టోబర్ లేదా నవంబర్‌లో ఎన్నికలు జరగవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలోనే సీఎం రాష్ట్ర ప్రజలపై వరాల జల్లు కురిపించారు. "మేము ప్రారంభం నుంచి చౌక ధరకే విద్యుత్తును అందిస్తున్నాము.

- సౌరవిద్యుత్ ఉత్పత్తి జోన్‌లను గుర్తించాలి
- ప్రాజెక్టుకలు అసవరమైన భూ సేకరణకు మద్దతు
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



### పునరుత్పాదక ఇంధనాలపై

## సహకారం

హైదరాబాద్,జూలై17, తెలంగాణ దిశ : పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకా రం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు- చేయాలన్నారు. గ్రిడ్ స్టెబిలిటీ-, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేయాలని తెలిపారు.



### ఇరాక్ షాపింగ్‌మాల్‌లో

## ఘోర అగ్నిప్రమాదం..

**50 మంది సజీవ దహనం..**

ఢిల్లీ,: ఇరాక్ అల్-కుత్ నగరంలోని ఒక హైపర్‌మార్కెట్‌లో గత రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 50 మంది మరణించినట్టు వాసిత్ ప్రావిన్స్ గవర్నర్ మొహమ్మద్ అల్-మియాహిని ఉటంకిస్తూ పలు వార్తా సంస్థలు నివేదించాయి. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న వీడియోల్లో భవనంలోని ఓ పెద్ద భాగం మంటల్లో చిక్కుకుంది. ఆ ప్రాంతం లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. అయితే, ఈ వీడియోను ధ్రువీకరించాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రాథమిక దర్యాప్తు ఫలితాలు రెండు రోజుల్లో వస్తాయని ఇరాన్ ప్రభుత్వ సంస్థ ఐఎన్ఏ తెలిపింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేం దుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఎక్కువమంది పిల్లలు ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



### ప్రజల ప్రాణాలతో

## కల్తీకల్లు చెలగాటం

- కూకట్‌పల్లి ఘటనతో ప్రభుత్వం కళ్లు తెరవాలి
- కల్లు డిపోలకు లైసెన్సులు రద్దు చేయాలి
- దుకాణాలు మూసేయాలని ప్రజల డిమాండ్

హైదరాబాద్,జూలై17 , తెలంగాణ దిశ :బిఆర్ఎస్ పాలకులు ముఖ్యంగా కెసిఆర్ పుణ్యమా అని హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తెరుచుకున్నాయి. ఎక్కడా కల్లు లేకున్నా హైదరాబా ద్‌లో కల్తీకల్లు వ్యాపారం సాగుతోంది. దీనికి కెసిఆర్, బిఆర్ఎస్ పాలకులు బాధ్యులు. గ్రామాల్లో తాగడానికి కల్లు లేకున్నా హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి ఇటీవల పలువురు మృత్యువాత పడ్డారు. కూకట్‌పల్లి ఘటనతో కల్లు ఉత్పత్తిపై అనుమానాలు బలపడ్డాయి.. గ్రామాల్లో సరిగా ఉత్పత్తి లేకున్నా హైదరాబాద్‌లో భారీగా కల్లు ఉన్నట్లు డిపోలు నడుపుతున్నారు. తాటి, ఈత చెట్ల నుంచి సీజన్ వారీగా మాత్రమే కల్లు వస్తుంది. ఒక్కో చెట్టు నుంచి గరిష్ఠంగా 12 లీటర్ల కల్లు తయారవుతుంది.



### బిసి ఆర్డినెన్స్‌పై

## కవిత సంచలన వ్యాఖ్యలు

**తీన్మార్ మల్లన్న విమర్శలను ఖండించకపోవడంపై ఆగ్రహం**

- ఇది ముమ్మాటికీ ఆమోదయోగ్యమేనని ప్రకటన
- న్యాయనిపుణలుతో చర్చించే వ్యాఖ్యానిస్తున్నట్లు వెల్లడి
- బిఆర్ఎస్ వాళ్లు బిసి ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారని విమర్శలు...

హైదరాబాద్, జూలై17, తెలంగాణ దిశ :బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. తాను న్యాయపరంగా అందరినీ సంప్రదించే కాంగ్రెస్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తునట్లు చెప్పారు.

### ఉనికి చాటుకునేందుకు

## హరీష్ యత్నం

- పసలేని వాదనలతో ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు
- అసెంబ్లీలో దమ్ముంటే ప్రాజెక్టులపై చర్చకు కెసిఆర్ రావాలి

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శ**



హైదరాబాద్,జూలై17, తెలంగాణ దిశ: హరీష్‌రావు ఆరు అడుగులు పెరిగాడే తప్ప అర అంగుళం మెదడు పెంచుకో లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమ ర్శించారు. హరీష్ రావు వాదనల లో పసలేదన్నారు. ఢిల్లీ మీటింగ్‌లో ఏం జరిగిందో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చెప్పిన తర్వాత హరీష్ రావు పిచ్చి వాగుడు వాగుతూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సిఎంల భేటీపై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీటిం గ్‌లో ఏయే అంశాలు మాట్లాడారో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా కూడా హరీష్ రావు మెదడు కు ఎక్కనట్టు ఉంది అంటూ సెటైర్ విసిరారు. హరీష్ అడ్డగోలు వాదన తో, అర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాప నలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం మాట్లాడగానే ఏదో ఒకటి మా ట్లాడి తన ఉనికిని చాటు కోవాలన్న తపన తప్ప హరీష్ రావుకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు సవాల్ విసిరారన్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చ ల్లో పాల్గొనండి లేదా తామే ఫామ్ హౌస్‌కు వచ్చి అక్కడ మాక్ అసెంబ్లీ పెడుతాము పాల్గొనండి..

# రూ. 12. 28 కోట్ల వ్యయంతో కొంపల్లి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి

## - మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టే నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ రూ. 12 కోట్ల 28 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాలనీలలో పర్యటన సందర్భంగా ఆయా కాలనీవాసులు సూచించిన సమస్యలను ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆయా కాలనీలలో బిటి, సిసి రోడ్లు, డ్రైనేజీ, చెరువు సుందరీకరణ, మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. దూలపల్లిలోని పలు కాలనీలతో పాటు కొంపల్లి ఊర చెరువును ఆయన సందర్శించారు. స్థానికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా జిమ్మి దేవేందర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో కొంపల్లి మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్, మున్సిపాలిటీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రూ. 70 లక్షలతో పిఎంఆర్ ఎన్‌క్లేవ్ (నియోలజీస్) నుండి దుర్గా నర్సరీ గార్డెన్స్ ద్వారా చావల వరకు 600ఎంఎం దయా ఆర్ సీసీ పైప్‌లైన్, కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లోని రాఘవల్ వేర్ హౌసింగ్ ఎదురుగా (ఓపెన్ లేఅవుట్) నుండి పామ్ మెడోస్ గేట్ వరకు ఇన్నోవేటివ్ స్పేస్‌లను క్రాఫ్టింగ్ మంజూరైందన్నారు. రూ. కోటి 50 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లో పామ్ మెడోస్ గేట్ నుండి శాంతి నగర్ కాలనీ మీదుగా స్ప్లెండిడ్ అపర్ణ పామ్ అవెన్యూ సహజ సెరీన్ అపార్ట్‌మెంట్ నుంచి పట్టణ ప్రకృతి వనం మీదుగా అపర్ణ సెప్టిక్ ట్యాంక్ వరకు 600ఎంఎం దయా ఆర్ సీసీ పైప్‌లైన్ మంజూరైందన్నారు. రూ. 45 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.1లోని సర్వీస్ రోడ్ వద్ద మికాసా స్టెర్లింగ్ రోడ్డు ద్వారా నోముల నిర్వాణ ద్వారా అపర్ణ పామ్ వరకు ఎస్ డబ్ల్యూజీ పైప్‌లైన్ మంజూరైందన్నారు. రూ. 43 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.06లో అను ఫర్నిచర్ షాపు నుండి లక్కీ టెంట్ హౌస్ వరకు సిసి రోడ్డు మంజూరైందని ఆయన తెలిపారు.రూ. 5 కోట్లతో కొంపల్లి మున్సిపాలిటీలోని వార్డు నెం.1లోని ఊర చెరువు కట్టను సుందరీకరణ,రూ. 35 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.08లో శ్రీ వేద నిలయం నుండి బాలాజీ విల్లాస్ వయా సాయి హంస నిలయం వరకు వైష్ణో ఎన్‌క్లేవ్‌కు చేరుకునే రోడ్డు మంజూరైందన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో వార్డు నెం.08లో నారాయణ స్కూల్ ద్వారా ఎస్ వి రెసిడెన్సీని ఎస్ వి సి బృందావన్ హైట్స్ వరకు మంజూరైందన్నారు. రూ. 3 కోట్లతో కొంపల్లి



మున్సిపాలిటీలోని పారిశ్రామిక ప్రాంతంలో దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుండి ధనరేఖ నిలయం వరకు బీటీ రోడ్డు మంజూరైందన్నారు.రూ. 50 లక్షలతో కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నెం.08లో సంజీవని మెడికల్ షాప్ నుండి విబ్రాంత్ విద్యుత్ అపార్ట్‌మెంట్ నుండి దుర్గా ఎన్‌క్లేవ్ వరకు సిసి రోడ్డు మంజూరైందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, కౌన్సిలర్ బి. శివ కుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, కావాలి శివాజీ, అంజి ముదిరాజ్, షేక్ ఇబ్రహీం, జయభేరి గోపాలరెడ్డి, అశోక్ రెడ్డి, పూర్ణచంద్ర రావు, నవీన్ ముదిరాజ్, రాము గౌడ్, రాజేష్ గౌడ్, సాయి యాదవ్, నాగరాజు యాదవ్, డప్పు నరేందర్, కుట శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, చందర్ నాయక్, విజయ్ నాయక్, రాజశేఖర్ తో పాటు కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పథకం చెక్కుల పంపిణీ : కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు మంజూరైన జక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా శ్రీనివాస్ నగర్ కు చెందిన కొట్ర కళావతికి రూ. 21, 500, కె. సింధుకు 37,500, చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అర్హులైన వారందరూ లబ్ధి పొందవచ్చును అన్నారు. అనారోగ్య పరిస్థితులతో చికిత్స చేయించుకుని వారికి ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు ఈ పథకం కింద సహాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భౌరంపేట్ సర్వే నెంబర్ 166/1, 3లో ప్రభుత్వ లావణ్య పట్టా భూమిలో అనుమతులు లేకుండా ప్రవేట్ వెంచర్ కోసం రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సతీష్ ఆధ్వర్యంలో దుండిగల్ తాహసిల్దార్, కమిషనర్లకు ఫిర్యాదు చేశారు.

# 'జీతో అప్నా ఘర్'లో పాలసీబజార్ ఉద్యోగులకు ఇళ్లు, కార్లు

హైదరాబాద్, జూలై 17, (తెలంగాణ దిశ) : అత్యుత్తమ ప్రతిభ చూపిన పాలసీ బజార్ ఉద్యోగులకు తమ 'జీతో అప్నా ఘర్' ప్రోగ్రామ్ లో భాగంగా ఇళ్లు, కార్లు అందజేసింది. ఇది ఐదవ ఎడిషన్. హైదరాబాదుకు చెందిన నలుగురు ఉద్యోగులకు కూడా బహుమతులు వచ్చాయి. అందులో ఇద్దరు ఇళ్లు, ఇద్దరు కార్లు గెలుచుకున్నారు. ఈ ఏడాది హైదరాబాదుకు చెందిన బసవ రత్నవల్లి, ఎ. రాకేశ్ ఒక్కొక్కరు ఒక్కో ఇంటిని, కందూరి పునగా వరాలీ, సల్కినేని రాజ్ కుమార్ కార్లు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాలసీబజార్ జాయింట్ గ్రూప్ సీఈఓ సర్బవీర్ సింగ్ మాట్లాడుతూ 'జీతో అప్నా ఘర్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదని, ఇది ప్రతిభను ప్రోత్సహించే ప్రత్యేక ప్రోగ్రామ్ అన్నారు. ఈ కార్యక్రమం మా అడ్వైజర్లలో విశ్వాసాన్ని కలిగించిందన్నారు. ఇది ప్రతిభను ప్రోత్సహించడమే కాకుండా, పాలసీబజార్ ప్రధాన లక్ష్యమైన 'హర్ ఫ్యామిలీ హోగీ ఇన్స్యూర్డ్' ముందుకు తీసుకెళ్లేందుకు కీలకంగా మారిందన్నారు. పాలసీబజార్ ప్రవేశపెట్టిన ఉద్యోగుల కేంద్రీకృత కార్యక్రమాలలో ఇది ఒకటన్నారు. ఉద్యోగులను మొదట ప్రాధాన్యంగా గుర్తించినప్పుడు, ఉద్యోగులు కూడా అంకితభావంతో పని చేస్తారన్నారు. పాలసీబజార్‌లోని ప్రాంతీయ బృందాల్లో ప్రతిభ ఎంత ఉందో ఈ విజయం నిరూపిస్తోందని తెలిపారు. ఈ ఎడిషన్ చాలా ప్రత్యేకమైనదన్నారు. ఎందుకంటే, ఇప్పటివరకు సేల్స్ విభాగానికి పరిమితమైన ఈ గృహ ప్రోత్సాహం, మొదటిసారి సర్వీస్ విభాగానికి విస్తరించడం జరిగిందన్నారు. ఇది సంస్థ అంతటా ఉన్న ప్రతిభను గుర్తించే దిశగా వేసిన మరో అడుగుగా చెప్పవచ్చన్నారు. ఇప్పటివరకు పాలసీబజార్ ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులకు 39 ఇళ్లు, 24 కార్లు, రూ. 40



కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు అందజేశామన్నారు. సీజన్ 5 లోనే 10 మంది అడ్వైజర్లకు ఇళ్లు, 8 మందికి కార్లు లభించాయన్నారు. ఇల్లు లేదా కారు గెలుచుకోకపోయినా, ప్రదర్శన ఆధారంగా 11 కోట్లు నగదు బహుమతులుగా పంపిణీ చేశామన్నారు. 'జీతో అప్నాఘర్' 5.0 గాలా నైట్ ఒక గొప్ప వేడుకగా జరిగింది. విజేతల ఎంపికను ప్రత్యేకంగా నిర్వహించిన 'స్పిన్ ది వీల్' కార్యక్రమంలో ప్రకటించారు. సీనియర్ లీడర్లు స్టేజిపైకి వచ్చి విజేతలను ప్రకటించినపుడు ప్రేక్షకుల్లో హర్షధ్వానాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా గృహ విజేత దీపక్ గుప్తా మాట్లాడుతూ 'ప్రతి సంవత్సరం ఈ పోటీలలో అర్హత సాధించాను. ఇప్పుడు నాకు సొంత ఇల్లు వచ్చింది. దీంతో నా కల నెరవేరింది. నా కృషిని గుర్తించి, ప్రతిఫలం ఇచ్చిన పాలసీబజార్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు.

# భద్రతతో ప్రసవం ఆరోగ్యంగా తల్లీ బిడ్డల భవిష్యత్తు

## - సురక్షిత ప్రసవ నిర్వహణపై వైద్యులకు ప్రత్యేక శిక్షణ

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 17, (తెలంగాణ దిశ)** :ప్రభుత్వ వైద్యశాలల్లో సురక్షిత ప్రసవ నిర్వహణపై వైద్యులకు గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వైద్య ఆరోగ్యశాఖ విభాగంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సి. ఉమాగౌరీ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల డాక్టర్లకు ఒక్క రోజు "దక్షత శిక్షణ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో వైద్యులు సురక్షిత ప్రసవ నిర్వహణ, నూతన శిశువుల తక్షణ సంరక్షణ, తల్లీబిడ్డల ప్రసవానంతర శ్రద్ధ, కుటుంబ నియంత్రణ పద్ధతులు, ప్రసవానంతర సంక్లిష్టతల నిర్వహణ, అలాగే సంక్రమణ నివారణ పద్ధతులు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్రమైన అవగాహన కల్పించారు. శిక్షణ శిబిరం ద్వారా వైద్యాధికారులకు నైపుణ్యాలు మెరుగవడంతోపాటు, ప్రామాణిక మార్గదర్శకాలకు అనుగుణంగా క్లినికల్ నిర్ణయాలు తీసుకునే దిశగా ప్రేరణ నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ "ప్రతి గర్భిణికి గౌరవంగా, భద్రతగా సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ప్రతి ప్రసవం శాస్త్రీయంగా జరగాలని, హై రిస్క్ గర్భధారణల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే వెంటనే అధిక స్థాయి



వైద్యం కోసం రిఫరల్ ఇవ్వడంలో ఆలస్యం చేయకూడదన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. వైద్యాధికారులందరూ ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను సేవలలో ప్రతిబింబింపజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిఓటి గా ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభరాజ్ బోధన ఇచ్చారు. కీసర ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సత్యవతి, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గీత, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు అత్యాధునిక వైద్య పరికరాలు అందజేత

## - ఇండియన్ ఆయిల్ సీఎస్ఆర్ లో భాగంగా..





**తిరుపతి, జూలై 17, (తెలంగాణ దిశ)** : ఇండియన్ ఆయిల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు రూ. 22.01 కోట్ల గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ గ్రాంట్ తో రెండు ప్రపంచ స్థాయి డయాగ్నస్టిక్ వ్యవస్థల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇందులో భాగంగా 3 టెస్లా ఎంఆర్ఐ స్కానర్ (14 కోట్లు), 4డి సీటీ సిమ్యులేషన్ సిస్టమ్ (8 కోట్లు). తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే ఈ వైద్య విద్యాసంస్థలో ఆరోగ్య సేవల సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఈ అధునాతన పరికరాల ద్వారా ప్రతి ఏటా 2.5 లక్షల మందికి పైగా రోగులు ప్రయోజనం పొందనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అత్యాధునిక వైద్య నిర్ధారణ, చికిత్స ప్రణాళిక సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి వర్చువల్ గా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్) వి. సతీష్ కుమార్, టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల నాయుడు, టుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు డాలర్ దివాకర్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్, వైఎస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్, ఇండియన్ ఆయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్‌ఆర్) ఎంఆర్ దాస్, సీజీఎం (ఎఫ్) ఏఆర్వీ బద్రీనాథ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి





**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 17, (తెలంగాణ దిశ)**జిల్లాలోని జిహెచ్ఎంసి పరిధిలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న 6880 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పురోగతిపై గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 30,068 డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉండగా అందులో 29,094 ఇళ్ళు ఇప్పటికే లబ్ధిదారుల కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన 974 ఇళ్ల కేటాయింపు ఈ వారంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న 6,880 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మూడు నెలల లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డబల్ బెడ్ రూమ్ జిహెచ్ఎంసి ఈఈలు, జిల్లా పంచాయతీ, ఆర్ అండ్ బి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జెఎన్ఎన్ యుఆర్ఎమ్ లో నీటి సమస్యకు పరిష్కారం

**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)**:దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ జెఎన్ఎన్ యుఆర్ఎమ్ 5 – బ్లాక్ వాసుల నీటి సమస్య పరిష్కారం కోసం గురువారం బోర్ వెల్ ను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. నీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది ఉందని గత నెల కాలనీ వాసుల హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. దీంతో వెంటనే స్పందించి సదురు కమిషనర్ తో మాట్లాడి మున్సిపల్ ఫండ్స్ ద్వారా బోర్ వెల్ ను మంజూరు చేయించారు. బోర్ వెల్ ను ప్రారంభించిన సందర్భంగా కాలనీవాసులు హన్మంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, కోలన్ జీవన్ రెడ్డి, బాల్ రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజు, వెంకటేష్ గౌడ్, హలో రాజు, నర్సింహా, శ్రీనివాసు, సుధారాణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగుల పెన్షన్లను పెంచాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరసన

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 17, (తెలంగాణ దిశ)** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లను పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పిఆర్ డి) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్ పిఆర్ డిజిల్లా అధ్యక్ష కార్యదర్శి కె. చంద్రమోహన్, కె. నాగలక్ష్మి మాట్లాడుతూ పెన్షన్ రూ. ఆరు వేలకు పెంచకుండా ప్రభుత్వం వికలాంగులను మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్న పెన్షన్ ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే 2023 డిసెంబర్ నుండి రూ. ఆరు వేల పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పారని విమర్శించారు. అదే విధంగా కొత్త పెన్షన్లను మంజూరు చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం చేయాలని వారి డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆర్ పిడి చట్ట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లలో 25 శాతం అదనంగా ఇవ్వాలని



డిమాండ్ చేశారు. వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు పెన్షన్ పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, కోశాధికారి జే మల్లేశ్, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం

ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఇప్పుడు తెలంగాణలో విస్తరించడమే టార్గెట్ గా పెట్టుకుంది. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఇటీవలే బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏం చేయబోతున్నారు? ఎలా విస్తరణకు ప్లాన్ చేశారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది. 1925 సెప్టెంబర్ 27న నాగ్ పూర్ లో ఏర్పాటైంది. ఈ సెప్టెంబర్ 27 వస్తే వందేళ్లు. అంటే శతాబ్ది ఉత్సవాలు ఓ రేంజ్ లో ఉండేలా ప్లాన్ ప్రిపేర్ చేసింది. అంతే కాదు.. విస్తరణ కూడా ఎవరూ ఊహించని వేగంతో చేయాలనుకుంటోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతోంది. ఇప్పుడు రాబోయే విజయదశమి రోజున చరిత్ర తిరగరాయాలని ఆర్ఎస్ఎస్ అనుకుంటోంది. తమిళనాడు మొదలుకుని కశ్మీర్ దాకా పథసంచలన్, శోభాయాత్రలు, ఘోష్ ఇవన్నీ చేయబోతున్నారు. ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా మధ్యలో శతాబ్ది వేడుకల కోసం సంఘ్ వేసుకున్న ప్లాన్ ఓ రేంజ్‌లో ఉంది. 1925లో సంఘ్ ప్రారంభమైనప్పటి నుంచీ చాలా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా మొత్తం 51,570 స్థలాల్లో ఖీూా రోజువారీ శాఖలు 83,129 నడిచేదాకా వెళ్లాయి. నాలుగైదేళ్లుగా శాఖలు, పాల్గొంటున్నవారి సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగినట్లు సంఘ్ అంటోంది. గతేడాదితో పోల్చితే 10 వేలకు పైగా కొత్త శాఖలు ప్రారంభమయ్యాయన్నారు తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్. వీటితో పాటు 32,147 వీక్లీ శాఖలు, 12,091 నెలవారీ శాఖలు నడుస్తున్నాయని, మొత్తంగా అన్నీ కలిపి 1,27,367 శాఖాపరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలలో 10 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఆ లెక్కన శాఖలకు ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటే స్లమ్స్‌లో సేవాబస్తీల పేరిట సంఘ్ విస్తరణ ప్రయత్నం చేసుకుంటున్నారు. అంటే హిందూ సొసైటీలో ఏ వర్గాన్ని కూడా పక్కన పెట్టకుండా అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది తెలంగాణలో విజయదశమి వేడుకల సందర్భంగా 161 ప్రదేశాలలో జరిగిన రూట్ మార్చ్‌లలో 50 వేల మందికి పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. ఇందులో 28 వేల మందికి పైగా స్వయం సేవక్స్ సంఘ యూనిఫామ్‌లో పాల్గొన్నారని తెలంగాణ ఆర్ఎస్ఎస్ శాఖ అంటోంది. ఈ సెప్టెంబర్ వస్తే ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అవుతుంది. మరి ఈ వందేళ్లలో సంఘ్ ఏం చేసింది? నేడు దేశంలో 1 కోటి మందికి పైగా స్వయంసేవకులు ఉన్నారని చెబుతున్న సంఘ్ పెద్దలు ఎలాంటి ఫ్యూచర్ టార్గెట్స్ పెట్టుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న సామాజిక సమస్యలపై సంఘ్ ప్లాన్స్ ఎలా ఉన్నాయి? తమ అనుబంధ సంస్థలకు పొలిటికల్ ప్లాట్ ఫామ్ గా ఆరెస్సెస్ శాఖలు ఉపయోగపడుతున్నాయారాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినా సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం సంఘ్ స్పెషాలిటీ. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. కేవలం సంఘ్ భావజాల వ్యాప్తే కాదు.. ఇంకొన్ని లక్ష్యాలు కూడా ఇప్పటికే వారు పెట్టుకున్నారు. సామాజిక అంశాలైన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ఫోకస్ పెంచుతున్నారు. అంతే కాదు.. గ్రామ వికాస కార్యక్రమాల పేరుతో మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి ఆపద వస్తే రక్షణగా నిలబడడం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోసంపద వృద్ధి, కుటుంబాల్లో మనస్పర్థలు తగ్గించేలా, వృద్ధులను ఆదరించేలా, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించేలా చేయడం, సోషల్ మీడియా అనర్థాలపైనా కార్యక్రమాల నిర్వహణ ప్రధాన లక్ష్యంగా ఉంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై యూత్ కు ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందులో సామాజిక సామరస్యం, కుటుంబం, పూర్వీకులు కుల దేవత గురించి స్మరించుకోవడం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో మాట్లాడటం, భారతీయ సాంప్రదాయ దుస్తులు వేసుకోవడం, సంస్కృతిని కాపాడడం, ప్రజల బాధ్యతల గురించి తెలిపేలా శిక్షణ ఉండబోతోంది. సంఘ్ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఖీూా ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్–డిసెంబర్–జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమం జరగబోతోంది. ఇందులో హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామంటున్నారు సంఘ్ పెద్దలు. గతేడాది సర్ సంఘచాలక్ మోహన్ భగవత్.. సంఘ్ కార్యకలాపాల విస్తరణ, ఏకీకరణ కోసం 2 ఏళ్లు కేటాయించే కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ పిలుపుతో 2,453 మంది స్వయంసేవకులు తమ ఇళ్లు వదిలి పూర్తిస్థాయి సంఘ్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అటు సంఘ్ కార్యకలాపాల్లో చేరే యువకుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఏడాది, లక్షలాది మంది యూత్, ముఖ్యంగా 14–25 ఏళ్ల మధ్య వయసున్న వారే సంఘ్ లో చేరుతున్నారంటున్నారు. ఆర్ఎస్ఎస్ అంటే సామాజిక సేవలో ముందుంటుందన్న అభిప్రాయం ఉంది. వరదలు వచ్చినా, భూకంపాలు వచ్చినా, కొండ చరియలు విరిగిపడ్డా.. సమస్య ఏదైనా విపత్తుల్లో సహాయాలు చేస్తూ స్వయం సేవకులు కనిపిస్తుంటారు. ఇలాంటి సేవా కార్యక్రమాల పట్ల యువతలో ఆసక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. సమాజానికి సేవ అన్నది ఆర్ఎస్ఎస్ కార్యకలా పాల్లో ప్రధాన అంశం. ఇటీవల కుంభమేళలోనూ వచ్చిన వారికి కంటి పరీక్షలు చేయించడం, పర్యవరణ పరిరక్షణ కోసం ఏక్ థైలా ? ఏక్ థాలి ప్రచారం చేసింది సంఘ్. ప్లాస్టిక్ ప్లేట్లు, పాలిథిన్ బ్యాగుల వాడ కం తగ్గించడానికి ప్రయత్నించింది. ఇవే కాదు.. సౌత్ నార్త్ విషయాల పైనా సంఘ్ రియాక్ట్ అయింది. ఇది రాజకీయంగా ప్రేరేపితమైన విషయమన్నది. అలాగే మాతృభాష విషయంలోనూ స్పష్టత ఇచ్చింది. మాతృ భాషను విద్యలోనే కాకుండా మన దైనందిన జీవితంలోని అన్ని అంశాలలో ఉపయోగించాలన్నది ఆర్ఎస్ఎస్ మాట. మాతృ భాషపై ఆర్ఎస్ఎస్ ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. బహుళ భాషలు నేర్చుకుంటే ఉపయోగమని, కెరీర్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ అని నేర్చుకుంటే తప్పులేదన్నది. సో సంఘ్ మ్యాటర్ ఖుల్లం ఖుల్లాగా ఉంది.

## సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలి

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, జూలై 17, (తెలంగాణ దిశ)** :ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కమలానగర్ కమ్యూనిటీ హాల్ లో కాప్రా సర్కిల్ స్థాయి వివిధ విభాగాల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యంగా బోనాల పండుగ నిర్వహణ, వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తీసుకోవలసిన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి ఉప్పల్




నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అధికారులందరూ తమ డివిజన్లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లతోపాటు ఏసిపిలు చక్రపాణి, వెంకట్ రెడ్డి, జిహెచ్ఎంసి ఈఈ నాగేందర్, జలమండలి ఎండి సంతోష్, డీఈ బాలకృష్ణ, విద్యుత్ డీఈ రవీందర్ లతోపాటు వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర్లను ఎస్ టి జాబితాలో చేర్చాలి

### - జాతీయ అధ్యక్షులు ఫీట్ల శ్రీధర్ ను సన్మానించిన దండుగుల స్వామి



**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :జాతీయ వడ్డెర సంఘం జాతీయ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఫీట్ల శ్రీధర్ ను దండుగుల స్వామి గురువారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్ టి జాబితాలో చేర్చాలని కోరారు. జాతీయ స్థాయిలో పోరాటాలను సాగించి డిమాండ్ ను సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెరను గుర్తించి సీట్ల కేటాయించాలన్నారు. ఓడర్లు ఐకమత్యంతో ఉద్యమించినప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తామని అన్నారు. రాజకీయంగా సైతం ఉన్నత స్థానాలలో ఉండవచ్చునని అన్నారు.

## బృందావన్ హిల్స్ పార్కు స్థలం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ బృందావన్ హిల్స్ సర్వేనెంబర్ 93 ప్రభుత్వ పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు కోరారు. గురువారం కబ్జాకు గురవుతున్న స్థలాన్ని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏసురత్నం, బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ సందర్శించారు. పార్కు స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించు కోవడం దారుణమని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజాంపేట సర్వే నెంబర్ 93, 95 ప్రభుత్వ స్థలం, సర్వేనెంబర్ 94 ప్రైవేట్ స్థలం అంటే పట్టా భూమిగా రికార్డు నమోదయి ఉందని అన్నారు. బృందావన హిల్స్ కాలనీ ఏర్పడినప్పుడు స్థానికంగా ఉన్న సర్వే నెంబర్ 93 ప్రభుత్వ భూమిలో కొంత స్థలాన్ని స్థానికంగా ఉన్న బృందావన్ హిల్స్ కాలనీ ప్రజల అవసరానికి పార్కు కోసం కేటాయించారని తెలిపారు. సర్వే నెంబర్ 93 ప్రభుత్వ స్థలం గతంలో కొంత కబ్జా జరిగిందని,




మిగిలిన పార్కు స్థలం కూడా కబ్జా చేసే ప్రయత్నంలో భాగంగా అక్కడ ఉన్న వస్తువులను ధ్వంసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలరావు, దస్తగిరి తదితరులు ఉన్నారు.

## త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అమర్ నాథ్ గౌడ్



**త్రిపుర,జూలై 17, (తెలంగాణ దిశ):** త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధానన్యాయమూర్తిగా జస్టిస్ అమర్ నాథ్ గౌడ్ ను నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాప్రా నేతాజీ నగర్ కు చెందిన అమర్ నాథ్ గౌడ్ కొన్నాళ్లు తెలంగాణలో హైకోర్టు న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పని చేశారు. గతంలో న్యాయమూర్తిగా అత్యధిక కేసులు పరిష్కరించి ఆయన రికార్డు సృష్టించాడు. ఈక్రమంలో తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం కూడా అందుకున్నారు. మరో వైపు యూకె వండర్ బుక్ ఆఫ్ రికార్డు చోటు దక్కింది.

## శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య రక్షణ కిట్లు పంపిణీ

### - కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, జూలై 17, (తెలంగాణ దిశ)** :జిహెచ్ఎంసి ఉప్పల్ డివిజన్ శానిటేషన్ సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఆరోగ్య రక్షణ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను నియంత్రణకు చేసే సేవలు మరువలేనివని అన్నారు. రక్షణ కిట్లు రెగ్యులర్ గా వినియోగించుకొని విధులు నిర్వహించేటప్పుడు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డివిజన్ లో ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సక్రమంగా పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ చందన, డివిజన్ అధ్యక్షుడు బాకారంలక్ష్మణ్, ఈగా ఆంజనేయులు ముదిరాజ్, తుమ్మల దేవిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, విజయ్, బొడిగె మల్లేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్ళు - మురికి కాలువల పాలు


### పైప్ లైన్ లీకేజీలు - పట్టించుకోని అధికారులు

### అధికారుల నిర్లక్ష్యం - ఆగ్రహిస్తున్న ప్రజలు

**జగిత్యాల,తెలంగాణ దిశ:** జిల్లాలోని బుగ్గారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట మిషన్ భగీరథ నీరంతా మురికి కాలువల పాలౌతోంది. గత కొన్ని నెలల నుండి పైపు లైన్ లీకేజీలతో నీరంతా రోడ్డు మీద పారుతూ మురికి కాలువల్లోకి చేరుతుంది. నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. గత కొన్ని నెలలుగా పలు చోట్ల ఇలాగే లీకేజీలయ్యి నీరంతా వృధా కావడం జరుగుతుందన్నా రు. నీరంతా కలుషితం అయినా అధికారుల్లో ఎలాంటి చలనం రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలకు మరమ్మత్తులు చేపట్టి అత్యంత విలువైన నీటిని వృధా కాకుండా,కలుషితం కాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామఅభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత 3–4సంవత్సరాల నుండి సంబంధిత ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారి వివేకానంద గౌడ్ (వివేక్) కు, మండల పంచాయతీ అధికారి అఫ్జల్ మియా కు, సంబంధిత కాంట్రాక్టర్ పందిరి తిరుపతి లకు ఎన్ని విజ్ఞాపనలు చేసినా ఫలితం శూన్యం అయిందని విడిసి ఆరోపణలు చేస్తోంది.

## సీఎం సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల విలువ ఎల్ఓసి అందజేత

**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నుంచి మంజూరైన రూ రెండు లక్షల చెక్కును గురువారం బిఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. జీడిమెట్లకు కడియం వెంకట నర్సింహా రావు (28) అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి నుండి రూ. 2 లక్షల విలువ గల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేక మెరుగైన చికిత్స కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలు ఈ ఎల్ఓసి సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, గుమ్మడి




మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, కాలే నగేష్, ఎల్లా గౌడ్, నదీమ్ రాయ్, బాల మల్లేష్, కాలే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో 51 కరువు మండలాల ప్రకటన

**అమరావతి,తెలంగాణ దిశ:** వర్షాభావ పరిస్థితులను దృష్టిలోఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి సారించింది. ఏపీలో కరువుమండలాలుగా 51మండలాలను ప్రకటించారు. ఇందులో భాగంగానే కరువు మండలాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. 37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. 14 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రబీ సీజన్ 2024–25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కరువు ప్రభావ కమిటీ–నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాముదృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు–, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా ప్రకటించారు.

## మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు అభినందనల వెల్లువ



**కుత్బుల్లాపూర్, జూలై 17, (తెలంగాణ దిశ):** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా నేరెళ్ల శారద పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.
ఈ సందర్భంగా రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ సంవత్సర కాలంగా మహిళా కమిషన్ చైర్మన్ గా నేరెళ్ల శారద సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. సమాజంలో వివక్షతకు, అణచివేతకు గురైన మహిళలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల హాస్టళ్ల విద్యార్థినీల సౌకర్యాల విషయంలో ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. సమర్థవంతంగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న నేరెళ్ల శారదకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.



## 284 మంది భారతీయుల దగ్గరే రూ. 98 లక్షల కోట్లు..!

ముంబై: దేశంలోనే అత్యంత ధనవంతుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ బాస్ ముకేశ్అంబానీ.. ప్రపంచంలోని టాప్–10కుబేరుల జాబితాలో ఈసారి స్థానం కోల్పోయారు. ఏడాది వ్యవధిలోనే ఆయన సంపద విలువ 13 శాతం తగ్గి రూ. 8.6 లక్షల కోట్లకు పరిమితమైంది. అయినప్పటికీ.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మరోవైపు అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే గతేడాది అత్యధికంగా సంపద పెంచుకున్న వ్యక్తిగా నిలిచారు. ఆయన సంపద రూ. 1లక్ష కోట్ల మేర పెరిగి రూ. 8.4 లక్షల కోట్లకు చేరుకుంది. హురూన్ విడుదల చేసిన 2025 గ్లోబల్ రిచ్ లిస్ట్ ఈ వివరాలను వెల్లడించింది.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

## ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**మేడ్చల్ కలెక్టరేట్,జూలై-17, (తెలంగాణ దిశ) :** ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. గురువారం శామీర్ పేట మండలంలోని అలియాబాద్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్యాంక్ లింకేజీ కింద 619 స్వయం సహాయక సంఘాలకు రూ. 38 కోట్ల 86 లక్షలు, 5 మండలాలకు 3698 స్వయం సహాయక సంఘాలకు సభ్యులకు వడ్డీ రాయితీ కింద కోటి 79 లక్షలు, 5 మంది మహిళలకు లోన్ భీమా కింద 3 లక్షల 19 వేల విలువ గల చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిలతో కలిసి మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు బస్సులు కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం కల్పించామని అన్నారు. 200 యూనిట్ కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. అలాగే జిల్లా కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ లు నడిపించే బాధ్యత అప్పగించామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో వాటిని నిర్వహించే బాధ్యత మహిళలకు అప్పగించామన్నారు. గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి రూ. 5 లక్షల వరకు అందిస్తున్నామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించే విధంగా కృషి చేశామని ఆయన తెలిపారు.గతంలో మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యం కాగా ప్రస్తుత ప్రభుత్వం కోటీశ్వరులను చేయాలని కృత నిశ్చయంతో పనిచేస్తుందని తెలిపారు. ఇందుకు అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేందుకు ప్రస్తుతం ఉన్న సభ్యులు, సంఘాలలో చేరితే వచ్చే లాభాల గురించి క్షుణ్ణంగా వివరించి నూతన సభ్యులకు సభ్యత్వం కల్పించాలని కోరారు. మహిళలు నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకొని అందుకు తగిన విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకుని, లక్ష్యాలను సాధించేందుకు మరింత కష్టపడాలని ఆయన సూచించారు. చిన్న వ్యాపారమే అని అనుకోకుండా, నిరంతరం కృషి చేస్తే మున్ముందు ప్రగతి సాధించడం పెద్ద కష్టం కాబోదని, తద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు దోహదమవుతుందన్నారు.

ఈ సందర్భంగా చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ "ధైర్యే సాహసే లక్ష్మిలి ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 36 వేల స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఉన్నారని తెలిపారు. అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూపులలో చేర్పింటకు కృషి చేయాలన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయల రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందని సూచించారు. ప్రపంచ దేశాలలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందన్నారు. తద్వారా వచ్చే లాభాలను వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఇంట్లో బాధ్యతలు నిర్వహణలో మహిళలే రోల్ మోడల్‌గా ఎదుగుతున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు వ్యాపారం చేసేందుకు కావల్సిన శిక్షణలు ఇస్తామని తెలిపారు. వారు ఎ రంగంలో కావాలంటే ఆ రంగంలోనే శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం మహిళ ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటిల బాధ్యత కూడా మహిళలకు అప్పగించామని అన్నారు. పాఠశాలలో యూనిఫామ్స్ కుట్టుటకు వారికే అప్పగిస్తే నిర్దేశించిన సమయంలోపు బట్టలను కుట్టి అప్పగించడం అభినందనీయమని ఆయన అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఐకేపి సంఘాలకు వడ్ల కొనుగోలులో ప్రాధాన్యత కల్పించామని తెలిపారు.

సమాజంలో మహి ళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు రాష్ట్రం, దేశం మొత్తం బాగుంటుందని ఆయన వివరించారు. అత్యధికంగా మహిళలు పనిచేస్తున్న దేశాలు అభివృద్ధిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహిళా సంఘాల ద్వారా లబ్దిపొందిన మహిళా సభ్యులు తమ తమ అనుభవాలను తెలియజేసారు.

ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధులు ఇందిరా మహిళా శక్తి పై పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్త, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింగ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఇంచార్జీ డిఆర్‌డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## 14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
## కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి

ఆదిలాబాద్: కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్న వాస్తవం ప్రజలు గమనిస్తున్నారని ఆ దశగా ప్రభుత్వం సైతం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లోక ప్రవీణ్ రెడ్డి అన్నారు.ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి మండలం లోని దీపాయిగూడ గ్రామంలో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈ జి ఎస్ గ్రాండ్స్ ద్వారా మంజూరు చేయించిన రూ.లు14లక్షల పనులకు ఆయన సోమవారం భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా లోక ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ ముందుకు వెళుతుందని తెలియజేశారు. ఇప్పటికే ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూపాయలు 500 కు సబ్సిడీ గ్యాస్, రైతులకు రెండు లక్షల రూపాయలు,అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి బృహత్తర కార్యక్రమాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

ఇందులో భాగంగానే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సదుద్దేశంతో జైనథ్ మండలంలోని దీపాయి గూడ గ్రామంలో14 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించుకోవడం జరిగిందని తెలియజేశారు. ఇది ఓర్వలేదు బిజెపి బి.ఆర్.ఎస్ నాయకులు ప్రభుత్వంపై లేని పోనీ ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను బంపర్ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గంగన్న, తాజా మాజి ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, గ్రామస్తులు ఏనుగు ప్రమోద్ రెడ్డి, హరీష్ రెడ్డి,గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.


## వైసీపీ ద్వారాలు తెరిచే ఉన్నాయ్...



విజయవాడ: వైసీపీ అధినేత జగన్ పార్టీ కార్యాలయం గేట్లు ఓపెన్ చేస్తున్నారు. గతంలో పార్టీని వీడిన నేతలను ఒక్కొక్కరుగా చేరిపోయేం దుకు సిద్ధమవుతున్నారు. పార్టీని వీడి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునేం దుకు కూడా జగన్ సిద్ధమయినట్లు తెలిసింది. ఈ మేరకు సంకేతాలను పంపారు. గతఎన్నికలకు ముందు, తర్వాత వివిధ కారణాలతో పార్టీని వీడి అనేక మంది సీనియర్ నేతలు పార్టీని వీడి వెళ్లారు. సామాజికవర్గం గానే మాత్రమే కాకుండా ఆర్థికంగా బలమైన నేతలు కూడా పార్టీని వీడివెళ్లారు. అయితే ఇతర పార్టీలకు వెళ్లిన నేతలు అక్కడ ఆనందంగా లేరు. అక్కడ వారికి ప్రాధాన్యత దక్కడం లేదు. మరొక వైపు వైసీపీకి అంతో ఇంతో మళ్లీ గ్రాఫ్ పెరుగుతుందని భావించి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరగుతుంది.. గత ఎన్నికల సందర్భంగా సీట్లు దక్కని వాళ్లు, జగన్ పోకడలను నచ్చని వాళ్లు పార్టీని వదిలి వెళ్లిపోయారు. కూటమి ఏర్పాటుతో తమ ఓటమి ఖాయమయిందని నమ్మిన నేతలు భవిష్యత్ లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించి తమ దారి తాము వెతుక్కున్నారు. జగన్ కూడా వెళ్లిపోయిన నేతలను ఎవరినీ ఆపలేదు. అలాగని రమ్మని పిలవడం లేదు. వారంతట వారు వస్తే మాత్రం తిరిగి పార్టీలో చేర్చుకుంటామని మాత్రం జగన్ సన్నిహి తుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ఎవరైనా వస్తానంటే తాను కాదంటానా? అని నవ్వుతూ ఆయన అనడంతో పార్టీని వీడిన నేతలను తిరిగి చేర్చుకుంటారన్న నమ్మకం నేతల్లో పెరిగింది.. ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీని వీడి వెళ్లి వచ్చినా ఆ యనను కూడా తిరిగి పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు గుర్తు చేస్తు న్నారు. తాజాగా ఇప్పటికే రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచం ద్రారెడ్డిని పార్టీలోకి చేర్చుకునేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో కాపు రామచంద్రా రెడ్డి వైసీపీని వీడి కాంగ్రెస్ లో చేరిపోయారు. తిరిగి ఆయన వస్తానని కబురు పంపడంతో జగన్ అందుకు అంగీకరించారంటున్నారు. ఒక ఫైన్ మార్నింగ్ కాపుకు వైసీపీ కండువా కప్పేందుకు సిద్ధమవుతున్నారు. కాపు రామచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు కూడా రాయల సీమ ప్రాంతం నుంచి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది తూ. గోనేత ఒకరిని... అంటే కూటమి పార్టీకి చెందిన నేతలు ఎవరూ రా రు. ఒకవేళ వచ్చినా ఎన్నికలకు ముందు మాత్రమే వస్తారు. తూర్పుగో దావరి జిల్లాలో అసంతృప్తిగా ఉన్న ఒక నేతను పార్టీలో చేర్చుకోవడానికి కూడా జగన్ దూతలను పంపినట్లు తెలిసింది. గత ఎన్నికలలో ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారని గ్రహించి దూతలను పంపారని సమాచారం. దీంతో పాటు ఇతర పార్టీల నేతలను కూడా పార్టీలోకి తీసుకుంటారని చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి కూడా అనేక మంది నేతలు వచ్చేందుకు సిద్ధమవుతు న్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఫ్యాన్ పార్టీకి త్వరలో చేరికలు ఉ ంటాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

## అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో
# చైన్ మెన్ విఫలం
## వినూత్నంగా వినతి పత్రం సమర్పణ...



Date: 17/7/25
Inward No:
G.H.M.C. KAPRA CIRCLE

తేది: 17-07-2025

శ్రీయుత గౌరవనీయులు,
చైన్ మెన్ గారు,
ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ 02,మరియుచర్లపల్లి డివిజన్ 03,
కాప్రా సర్కిల్ 01, జిహెచ్ఎంసి.

విషయం... కాప్రా సర్కిల్లోని 02 & 03 డివిజన్లా పరిధిలో ఇంటి నిర్మాణ కట్టడాలు విషయం

అయ్యా!

మీకు తెలియజేయునది ఏమనగా.... మీరు విధులు నిర్వహిస్తున్న కాప్రా సర్కిల్ 01 పరిధిలో ఉన్నటువంటి డివిజన్ 02 మరియు డివిజన్ 03 సంబంధించి మీ విధులలో భాగంగా మీ పర్యవేక్షణలో ఎన్ని ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయో వాటిలో ఏమైనా లోటుపాట్లు అక్రమ కట్టడాలు అంటే అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న ఇంటి నిర్మాణ కట్టడాల ప్రక్రియలో మీరు తీసుకుంటున్న చర్యల భాగంగా అక్రమా నిర్మాణ కట్టడాలు జరిగితే మీ పై అధికారులకు మీరు ఇచ్చే సమాచారం/రిపోర్ట్ ఆధారంగా పై అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి విధుల లో భాగంగా మీ పర్యవేక్షణలో ఇప్పటివరకు అనగా మీరు బాధ్యతలు తీసుకున్న తేదీ నుండి నేటి వరకు కాప్రా సర్కిల్లోని డివిజన్ 02 మరియు డివిజన్ 03 లో జిహెచ్ఎంసి ద్వారా పొందిన అనుమతుల ప్రకారము జరుగుచున్న నిర్మాణా కట్టడాలు ఎన్ని అలాగే అనుమతుల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణా కట్టడాలు ఎన్ని లేదా పూర్తి అయిపోయిన నిర్మాణాలలో జిహెచ్ఎంసి అనుమతి ప్రకారం పూర్తయింది నిర్మాణ కట్టడాలు ఎన్ని అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా పూర్తి అయినా నిర్మాణ కట్టడాలు ఎన్ని వాటి వివరాలు తెలుపుతూ దీని పై మీ యొక్క స్పందన తెలియజేస్తూ మీ జిహెచ్ఎంసి విధుల ప్రకారం పై అధికారులకు ఇచ్చినటువంటి సమాచారం/రిపోర్ట్ వివరాలు ఇందుకు అనుగుణంగా వారు అక్రమ నిర్మాణ కట్టడాల పై తీసుకున్న చర్యలు ప్రజలకు తెలియజేయాలని మనవి చేస్తున్నాను

.ఇట్లు

T. GaganKumar 17/07/25
తాడూరి గగన్ కుమార్,
సమాచార హక్కు సాధన సమితి, కన్వీనర్,
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
9908383987

**కాప్రా, జూలై 17, (తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల అరికట్టడంలో చైన్ మెన్ బాలరాజు విఫలమయ్యారని, ఇందుకు నిరసనగా ఆయనకే గురువారం వినతి పత్రం ఇచ్చేందుకు సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరు జగన్ కుమార్ ప్రయత్నించారు. ఈ వినతి పత్రాన్ని ఆయన తీసుకోక పోవడంతో జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ ఇన్ వార్డ్ లో వినతిపత్రం సమర్పించారు. సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్, చర్లపల్లి డివిజన్ల పరిధిలో జరుగుతున్న



అక్రమ కట్టడాల కు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు. ఆయా డివిజన్ లలో పరిధిలో ఎన్ని నిర్మాణాలు అనుమతి మేరకు జరిగాయో తెలుపాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నిర్మాణాల వివరాలను సైతం తెలియజేయాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై ఉ న్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం వల్ల రోజు రోజుకు అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉ న్నప్పటికీ కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని అన్నారు. దీనివల్ల జిహెచ్ఎంసి పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చైన్ మెన్ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు చైన్ మెన్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## దేశంలో రోడ్లు అస్సలు సురక్షితం కావట..!



జోహెన్నస్‌బర్గ్: వాహనాల డ్రైవర్లకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర దేశంగా దక్షిణాఫ్రికా వరుసగా రెండవ ఏడాది జాబితాలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. 53 దేశాలలో పరిశోధన చేసిన అమెరికాకు చెందిన డ్రైవర్ ట్రైనింగ్ కంపెనీ తాజా జాబితాను విడుదల చేసింది. డ్రైవర్లకు అత్యంత ప్రమాదకరమైన, సురక్షితం కాని దేశాల జాబితాలో భారత్ 5వ స్థానాన్ని దక్కించుకుంది. అమెరికా భారత్‌ను మించిపోయి 3వస్థానాన్ని సాధించినట్లు డ్రైవింగ్ కోర్సులను నిర్వహిస్తున్న అంతర్జాతీయ డ్రైవర్ల శిక్షణ కంపెనీ జుటోబీ.కాం వెల్లడించింది. ప్రపంచం లో డ్రైవర్లకు అత్యంత సురక్షిత దేశంగా వరుసగా నాలుగో ఏడాది నార్వే నిలిచింది. సురక్షితం కాని దేశాలలో దక్షిణాఫ్రికా అగ్ర స్థానంలో ఉంది.

# పట్టుకోండి చూద్దాం...

**నెల్లూరు, తెలంగాణ దిశ :**కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏప్రిల్ మూడో తేదీన ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన మాత్రం దొరకడం లేదు. హైకోర్టులో కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో ఆయన అప్పటి నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఏడు బృందాలు పోలీసులు నిరంతరం గాలిస్తున్నాయి. ఎక్కడా ఆయన ఆచూకీ దొరకడం లేదు. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి కనిపెట్టలేకపోవడంతో పోలీసులపై ప్రభుత్వం పెద్దలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు నెల రోజుల నుంచి కాకాణి తప్పించుకుతిరుగుతున్న పట్టుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసుల విచారణకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. హైకోర్టులో కూడా ఆయనకు ముందస్తు బెయిల్ రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి తప్పించుకుతిరుగుతుండటంతో నెల్లూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదయింది. విచారణకు హాజరు కాకుండా ఉన్న కాకాణిని ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నిమార్లు ఇంటికి వెళ్లినా కుటుంబ సభ్యుల నుంచి మాత్రం ఒకటే సమాధానం. తమకు తెలియదని, కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో పాటు ఆయన ఎక్కడకు వెళ్లారన్నది అర్థం కాకుండా ఉంది. పోలీసులు అన్ని రకాలుగా నిఘా పెట్టారు. కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన సన్నిహితుల పై కూడా కన్నేసి ఉంచారు. వారి ఫోన్లను కూడా ట్రాప్ చేస్తున్నారు. అయినా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాత్రంఎవరికీ ఫోన్లు చేయడం లేదు. ఇలా దాదాపు నెల రోజుల నుంచి పోలీసుల కళ్లుగప్పితప్పించుకుని తిరుగుతుం డటం పోలీసులకు సవాల్ గా మారింది. అనుమానం వచ్చిన అన్ని ప్రదేశాల్లో వెదుకుతున్నా ఆయన ఆచూకీ ఇసుమంత కూడా దొరకకపోవడంతో ఉన్నతాధికారుల చేత చీవాట్లు తింటున్నారు. మొత్తం మీద కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసులకు చిక్కడు దొరకడు అన్న రీతిలో తప్పించుకుతిరుగుతున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు.

# సరిహద్దు చెంత కన్నీటి కథలు ..!



పహల్గామ్‌లో జరిగిన ఘోరం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. బాధితులకు తీరని శోకం మిగిల్చిన ఈ దుశ్చర్యని ప్రజలంద రూ తీవ్రంగా ఖండిం చారు. దు:ఖం, ఆవేదన ఒక్కసారే చుట్టుముట్టిన మృతుల కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. అయితే ఇదంతా ఘటనకి ఒకవైపు పార్శ్వం. ఇప్పుడు ఘటనకి రెండో పార్శ్వం గురించి చర్చించు కోవాలి. 'దాయాది దేశం అండతోనే దుండగులు ఈ దుశ్చర్యకి పాల్పడ్డారు కాబట్టి, భారత్‌లో ఉన్న పాకిస్తానీయులు గంటల వ్యవధిలో ఈ దేశం విడిచి పోవాలని పాలకులు హుకుం జారీచేశారు. సరిహద్దు మూసేసిన తరువాత ఈ దేశంలో ఇంకా ఉ న్నట్లైతే జరిమానాతో కూడిన శిక్ష విధిస్తామ'ని తెగేసి చెప్పారు. ఈ ఆదేశం ఇప్పుడు వేలాది కుటుంబాలను విచ్ఛిన్నం చేసింది.

ఒకప్పుడు వాఘా సరిహద్దు ఇరు దేశాల మధ్య మిత్రబంధాన్ని పెంచితే ఇప్పుడు అదే సరిహద్దు తల్లిని పిల్లలకు దూరం చేసింది. భార్యభర్తలని విడదీసింది. అనారోగ్యం పాలైన అభాగ్యులకు వైద్యం అందకుండా వెనక్కి పంపేసింది. కళ్ల నిండా నీళ్లతో, దు:ఖాన్ని దిగమింగుకుంటూ వాఘా సరిహద్దు వద్ద బారులు తీరిన లైన్లలో ఎందరో అమ్మలు, బిడ్డలు, ఆలుమగలు అక్కడ కనిపించారు. ఒక్కొక్కరిది ఒక్కో విషాదకథ. గుండెని పిండేసే వ్యథ..

సనా భారతీయురాలు. 2020లో తన అత్త కొడుకు పాకిస్తాన్ కరాచీలో ఉంటున్న పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఆ దంపతులకు ఇద్దరు బిడ్డలు. మూడేళ్ల ముస్తఫా, ఏడాదిన్నర వయసున్న మహనూర్. ఏప్రిల్ 14న సనా, మీరట్‌లో ఉంటున్న తన పుట్టింటికి పిల్లలతో కలసివచ్చింది. పెళ్లయ్యాక ఆమె భారత్‌కి రావడం ఇది రెండోసారి. 45 రోజుల వీసా గడువుతో ఇండియాలో అడుగుపెట్టిన సనా, పహల్గామ్ దాడి తరువాత పాలకులు ఇచ్చిన ఆదేశాలతో 11 రోజులకే పాకిస్తాన్‌కి తిరుగుముఖం పట్టింది. వాఘా సరిహద్దుకి చేరింది. అక్కడ వారి గుర్తింపు పత్రాలు పరిశీలించిన అధికారులు, సనాకి భారతీయ పౌరసత్వం ఉన్న కారణంగా తనని ఆపేశారు. పిల్లలకు పాకిస్తాన్ పౌరసత్వం ఉంది కాబట్టి వారిని సరిహద్దు దాటించారు. వివాహం అయి 9 ఏళ్లుపూర్తయితేనే సనాకి పాకిస్తాన్ పౌరసత్వం వస్తుంది. కాబట్టి తనకి ఇంకా ఆ దేశ గుర్తింపు కార్డు రాలేదు. ఇప్పుడు సనా తన ఇద్దరు బిడ్డలకి దూరమైంది. పిల్లలిద్దరూ భర్తతో, సనా ఒక్కత్తే పుట్టింట్లో ఉండిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

**అమ్మ లేకుండా.. అనారోగ్యంతోనే..:** 17 ఏళ్ల మహ్మద్ అయాన్, ఎస్‌యువి వ్యాన్‌లో ఓ మూలన కూర్చొని ఉన్నాడు. ఏడ్చి ఏడ్చి అతని కళ్లు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. వైద్యం కోసం అయాన్ ఇండియాకి వచ్చాడు. రెండేళ్ల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్‌లో అతని శరీరం చచ్చుపడిపోయింది. వీల్‌ఛైర్‌కే పరిమిత మైన కొడుకుకి మంచి చికిత్స చేయించుకోవాలని తల్లి అతన్ని తీసుకుని మార్చి 17న ఇక్కడికి వచ్చింది. ఆస్పత్రిలో అతనికి మెరుగైన వైద్యం అందుతోంది. ఉరుము మీద పిడుగులా పహల్గామ్ దాడితో అయాన్, అతని ముగ్గురు అక్కల పాకిస్తాన్ వీసాలు రద్దయ్యాయి. ఇప్పుడు వారంతా బలవంతంగా ఈ దేశం వీడుతున్నారు.

ఇక్కడ ఇంతకంటే విషాదం ఏంటంటే, అయాన్, అతని అక్కలు, వాళ్ల అమ్మ లేకుండా పాకిస్తాన్‌కి పయన మయ్యారు. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకున్న అయాన్ వాళ్ల అమ్మ భారతీయురాలు. ఆమెకి ఇక్కడ పౌరసత్వం ఉంది. అమ్మని వదిలివెళ్తున్న అయాన్ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు. 'ఇప్పుడు నేను ఒంటరిగా ఇంటికి వెళ్లాలి. అక్కడ అమ్మ లేదు. ఈ బాధ, నా అనారోగ్యం కంటే నన్ను ఎక్కువగా బాధపెడు తోంది' అంటూ అయాన్ ఏడ్వడం చూసిన అతని అమ్మ, అక్కలు ఒక్కసారిగా ఘొల్లుమన్నారు.

**నా వాళ్లతో మనస్ఫూర్తిగా మాట్లాడనేలేదు..:** 10 ఏళ్లుగా వీసా కోసం దరఖాస్తులు చేసుకుని, ఇటీవలే తన పుట్టింటికి చేరింది 52 ఏళ్ల సలీమున్నిసా. 'అక్కాచెల్లెళ్లతో సంతోషంగా గడపాలని ఎన్నో కలలు కన్నాను. ఇష్టమైన ఆహారం వండించుకోవాలనుకున్నాను. అమ్మ తరపు బంధువులందరినీ కలవాలనుకున్నాను. కానీ ఇప్పుడవేమీ జరగలేదు. రోజుల వ్యవధిలోనే ఉన్న ఫళంగా వెనుదిరిగాను. మళ్లీ నా వాళ్లని ఎప్పుడు కలుస్తానో తెలియదు' అంటూ విచారంగా ముఖం పెట్టిన సలీమా లాంటి వాళ్లు అక్కడ ఎంతోమంది.

**మేము లేకుండానే మా బిడ్డ పెళ్లవుతోంది..:** 55 ఏళ్ల సింధు కార్వర్ భారతీయ హిందూ మహిళ. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఏప్రిల్ 29న జోధపూర్‌లో తన కూతురు వివాహం చేయాలని సింధు కుటుంబమంతా భారత్‌కి వచ్చింది. పెళ్లికి అన్నీ సిద్ధం చేసుకున్నాక వాళ్ల వీసాలన్నీ రద్దయ్యాయి. పెళ్లికూతురు భారత్‌లో పుట్టింది కాబట్టి, ఆమెకి ఈ దేశ పౌరసత్వం ఉంది. దీంతో ఆమెని అక్కడే వదిలి 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఆ కుటుంబం వాఘా బోర్డర్ చేరుకుంది. అక్కడ అదే పనిగా ఏడుస్తున్న సింధుని ఓదార్చడం అక్కడున్న వాళ్ల తరం కావడం లేదు. 'కూతురు పెళ్లి ఎంతో సంతోషంగా చేయాలను కున్నాం. డిసెంబరులోనే ఇక్కడికి వచ్చాం. షాపింగ్ చేశాం. బంధువులందరినీ పిలిచాం. రెండు రోజుల్లో పెళ్లి ఉందనగా 'పాకిస్తాన్ దేశీయులు దేశం విడిచి వెళ్లిపోవాల'న్న వార్తలు చూశాం. కాశ్మీర్‌లో ఏం జరిగిందో నాకు తెలియదు. ఈ రాజకీయాలు అర్థం చేసుకునేంత పరిణతి నాకు లేదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే.. ఇప్పుడు మేము లేకుండానే మా కూతురు పెళ్లి జరగబోతోంది. ఏ తల్లికీ నాలాంటి పరిస్థితి రాకూడదు' అని సింధు ఏడ్వడం తన మేలిముసుగులోంచి స్పష్టంగా కనిపిస్తోంది.

ఇలాంటి ఎన్నో విషాదాలు వాఘా సరిహద్దు వద్ద కనిపించాయి. ఉన్మాదం నిండిన వ్యక్తులు చేసిన, చేస్తున్న దుశ్చర్యలు బతికున్న వాళ్లని కూడా జీవచ్ఛవాలుగా చేస్తున్నాయి. వేలాది కుటుంబాలని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్ని వయసుల వారు ఈ విపరీతాలకు తల్లడిల్లిపోతున్నారు.

# హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :**తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల మీద ఉచితాలు ప్రకటించారు. ఏకంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియాగాంధీ లాంటి వారిని పిలిపించి డిక్లరేషన్లు ప్రకటించారు. కానీ వాటి అమలులో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రేవంత్ రెడ్డికి తెలుసు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే నాటి కెసిఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. గడువు ముగియకముందే ముందుగానే వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. తద్వారా అప్పటి ఎన్నికల్లో నెగ్గడానికి ప్రణాళికలు రూపొందించింది. కానీ ఆ ఎన్నికల్లో ప్రజలు వేరే విధంగా తీర్పు ఇవ్వడంతో భారత రాష్ట్ర సమితికి తల బొప్పి కట్టింది.

ఇక నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిల్లో కొన్ని మాత్రమే అమలులో పెట్టింది. అమలు ఉన్న పథకాలు కూడా అంతంతమాత్రంగానే ప్రజలకు చేరువవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ప్రస్తావిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగుతోంది. ఇది ఊహించిన పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకుంది. ఇటీవల జరిగిన ప్రతి సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు. చివరికి ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే.. తెలంగాణ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే బాగుపడుతోందని.. కార్మికులు సమ్మెకు దిగితే నష్టం తీవ్రంగా వాటిల్లుతుందని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఏమాత్రం బాగోలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని రేవంత్ రెడ్డి పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగో లేనప్పుడు..

అని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించమని ఎవరు చెప్పారు? నాడు అవుటర్ రింగ్ రోడ్డు ను లీజుకు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని లెక్కలతో సహా వివరించారు. మరి అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేయాలంటే డబ్బులు ఉండాలనే విషయం రేవంత్ రెడ్డికి తెలియదా.. అంటే అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇస్తారా? చివరికి ఓట్లు వేయించుకొని ప్రజలను వెర్రివాళ్లను చేస్తారా? అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. ప్రతి సమావేశంలోనూ బడ్జెట్ పద్మనాభం లాగా లెక్కలు వేయడం.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం.. పరిపాటిగా మారిపోయిందని.. రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

# 85 కిలోమీటర్ల కు మెట్రో డీపీఆర్ రెడీ



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** హైదరాబాద్ మెట్రో 'బి' భాగంగా జేబీఎస్ నుండి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుండి శామీర్‌పేట (21 కి.మీ.), శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.) వరకు మూడు కీలకమైన మెట్రో మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కేంద్రానికి పంపుతుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదన ఉంది.. దీనిరూపకల్పన జపాన్‌లోనిరవాణా వ్యవస్థ ను స్ఫూర్తిగా తీసుకుంటుంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ తన రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. రెండో దశ 'బి'లో భాగంగా ప్రతిపాదించిన కీలకమైన మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదించాల్సి ఉంది. బోర్డు ఆమోదం తర్వాత.. రాష్ట్ర మంత్రివర్గం దీనిపై చర్చించి ఆమోదం తెలుపుతుంది. అనంతరం.. తుది అనుమతి కోసం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు.రెండో దశ 'బి'లో హైదరాబాద్ నగరంలోని ఉత్తర ప్రాంతా లకు మెట్రో అనుసంధానాన్ని విస్తరించేందుకు ముఖ్య మైన ప్రతిపాదన లు ఉన్నాయి. ఇందులో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుండి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్ల మేర ఒక మార్గం, అలాగే జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు 21 కిలోమీటర్ల మేర మరొక మార్గం ప్రతిపాదించబడ్డాయి. వీటితో పాటు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం యొక్క డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుండి ప్రారంభమై.. కొత్తగా ప్రతిపాదించిన మెట్రో రైలు డిపో పక్కనుంచి.. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి ఆకాశ మార్గంలో కొనసాగుతుంది. ఇది మాన్సాన్‌పల్లి, బహుదూర్‌గూడ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్, తుక్కుగూడ ఎగ్జిట్, రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సర్వీస్ రోడ్డులో వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. అక్కడి నుండి, ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి ద్వారా కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ , మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ మార్గం విస్తరించనుంది.ఈ డీపీఆర్‌ను మొదట హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఎండీతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శులు మరియు హెచ్ఎండీఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు.. జేబీఎస్ వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రితో పాటు జపాన్ పర్యటనకు వెళ్లిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అక్కడి అనుభవాలను ఈ మెట్రో హబ్‌లో పొందుపరిచేందుకు కృషి చేస్తున్నారు.జపాన్‌లో బుల్లెట్ రైళ్లు, మెట్రో,సాధారణ రైలు సదుపాయా లు ఒకదానితో మరొకటి అనుసంధానించబడి ఉంటాయి. ప్రయాణికు లు ఒక రైలు నుండి మరొక రైలుకు సులభంగా మారేలాఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇదే తరహా అనుసంధాన వ్యవస్థను జేబీఎస్ మెట్రో హబ్‌లో కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

# మళ్లీ టీడీపీ వైపు

**విజయవాడ, తెలంగాణ దిశ :** ఆ ఇద్దరు నేతలు తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు. ఎన్నో కీలక పదవులు అనుభవించారు. కానీ అనుకోని రీతిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా అనుకున్నంత సక్సెస్ కాలేకపోయారు. కేవలం అప్పటి అధికార వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ పార్టీలోకి జంప్ చేశారు. కానీ ఇప్పుడుతిరిగి మాతృ పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్న ట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వారు పొలిటికల్ సర్కిల్లో నిలబడ్డారు. ఇంతకీ ఎవరా నేతలు? ఏంటా కథ? అంటే వివరాల్లోకి వెళ్దాం.ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయంగా చైతన్యవంతం అయ్యింది. ఈ జిల్లా నుంచి ఎంతోమంది హేమాహేమీలు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అందులో ఒకరు కరణం బలరామకృష్ణ. సుదీర్ఘకాలం టిడిపి నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన బలరామకృష్ణకు మంత్రి పదవి అన్నది దక్కకుండా పోయింది. ప్రకాశం జిల్లా రాజకీయాలను శాసించిన ఈ నేత అమాత్య అని అనిపించుకోలేకపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ నుంచి మంత్రిగా అవుతానని భావించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. మరో మాజీ మంత్రి సిద్దా రాఘవరావు ది విచిత్ర పరిస్థితి. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకున్నారు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఓడిపోవడంతో రాఘవరావు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేవలం వ్యాపారాలపై ఒత్తిడి పెరగడంతోనే వీరు వైసీపీలో చేరినట్లు ఒక ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు తిరిగి టిడిపిలో చేరేందుకు వీరిద్దరూ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.కరణం బలరాం విషయంలో టిడిపి నుంచి అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఎందుకంటే చీరాల నుంచి టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు. గెలిచిన తర్వాత పార్టీ క్లిష్ట సమయంలో ఉండగా గుడ్ బై చెప్పారు కరణం బలరాం. అందుకే ఎట్టి పరిస్థితుల్లో కరణం బలరామును పార్టీలో చేర్పించుకోవద్దని చంద్రబాబుపై టిడిపి శ్రేణుల ఒత్తిడి ఉంది. దీంతో చంద్రబాబు సైతం కరణం బలరాం విషయంలో ముఖం మీద



చెప్పినట్లు సమాచారం. అయితే ఆయనను జనసేనలో చేర్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. తన కుమారుడు వెంకటేష్ రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలో చేరేందుకు బలరాం దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.మరోవైపు సిద్దా రాఘవరావువిషయంలో మాత్రం టిడిపిలో సానుకూలత వ్యక్తం అవుతోంది. ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి రాఘవరావుకు అరుదైన అవకాశం ఇచ్చారు చంద్రబాబు. 2014లోగెలవడంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2019 లోఎంపీగా కూడా పోటీ చేశారు రాఘవరావు. అయితే ఆయనకు గ్రానైట్ తో పాటు ఇతరత్రా వ్యాపారాలు ఉన్నాయి. అప్పటి అధికార వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడి చేసి రాఘవరావును పార్టీలో చేర్చుకుందని..తీరాచేర్చుకున్నాక పట్టించుకోకుండా మానేసింది అన్న సానుభూతిఆయనపై ఉంది. అందుకే రాఘవరావు విషయంలో చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని ప్రచారం సాగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## సర్వీసు రోడ్డులో అక్రమ నిర్మాణాలు: బీజేపీ

**చౌటుప్పల్,తెలంగాణ దిశ:** యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అట్టి అక్రమ కట్టడం దర్గాపై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో కు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేసిన.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,దూడల భిక్షం, బిజెపి నాయకులు పాల్గొన్నారు. గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై గ్రీన్ ఫీల్డ్ హైవేలు మరియు ఎక్స్ ప్రెస్ రహదారులు

నిర్మించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది కానీ విజయవాడటు హైదరాబాదుకు వెళ్లే జాతీయ రహదారి 65 పై సర్వీస్ రోడ్లో అడ్డంగా ప్రార్థనా మందిరాలు నిర్వహిస్తున్న కానీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరిస్తున్నారు వీరి వ్యవహార శైలి చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని సుమారు 114 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిన తర్వాత అనుమతులు వచ్చిన తర్వాత దాని అలైన్మెంట్ ఈ దర్గా కోసం అలైన్మెంట్ మార్చారు మొదట ఎలాగైతే అనుమతులు ఇచ్చారో దాని ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఒక వర్గం కోసం ఎదురు చూడకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రహదారులు నిర్మించాలని కోరారు..



ప్రభుత్వాల విధానాలతో..

# ఉక్కిరిబిక్కిరి అవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

-పెరుగుతున్న ఖర్చులు
-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది.

ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించక పోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి.

హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి. దేశంలో అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ పట్టణాల్లో తమ అమ్మకాలు 2 శాతం తగ్గాయని ప్రకటించింది. ఈ సంవత్సరం జనవరి నుండి, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 9 శాతం తగ్గాయి. మోటార్ సైకిల్ అమ్మకాలు 13 శాతం, మోపెడ్ అమ్మకాలు 18 శాతం తగ్గాయి. నెస్లే ఇండియా ప్రతినిధి సురేష్ నారాయణన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అమ్మకాలు మందగించడం వెనుక 'తగ్గుతున్న మధ్యతరగతి' ఒక ముఖ్య కారణంగా చెప్పారు. 'ఒకప్పుడు రెండంకె లుగా ఉన్న ఆహార, పానీయాల రంగంలో వృద్ధి ఇప్పుడు 1.5 నుండి 2 శాతానికి పడిపోయింది' అని ఆయన పేర్కొన్నారు. నెలకు రూ. 40,000 నుండి రూ.55,000 వరకు సంపాదించే వారు ఒక్కొక్కరు 5-6 రకాల రుణాలు రూ.6 లక్షల నుండి రూ.30 లక్షల వరకు తీసుకుంటున్నట్లు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నివేదిక తెలిపింది. వీరు పొందుతున్న ఆదాయంలో సుమారు 50 శాతం పైగా వడ్డీల చెల్లిం పులకే సరిపోతుందట!

దిగువ మధ్యతరగతి తమ దగ్గర వున్న బంగారా న్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం పెరిగింది. ఈ తరహారుణాలు 2024-25ఆర్థిక సంవత్సరంలోనే71 శాతం పెరిగా యి. అంతకు ముందు సంవత్సరంలో 17 శాతం పెరిగాయి.

మార్చి 2020లో అప్పుల్లో వున్న కుటుంబాలు దేశ జాతీయోత్పత్తిలో 35 శాతం వుండగా, జూన్ 2024నాటికి 43శాతానికిపెరిగాయని రిజర్వు బ్యాంకు తెలిపింది. ఒకవైపు మధ్యతరగతి వాస్తవ పరిస్థితి దిగజారు తుంటే దేశ తలసరి ఆదాయం 2,841 డాలర్లు (సుమారు రూ. 2,52,000) కు చేరుకుందని, 2047నాటికి రూ.15లక్షలకు చేరుకుం టుందని ప్రధాని ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ ప్రకటిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం అనుసరించిన విధానాల ఫలితంగా దేశంలో 1900 సంస్థలను ప్రభుత్వ రంగం నిర్వహించింది. ఇందులో లక్షల మంది ఉద్యోగాలు పొందారు. రైల్వే, రోడ్లు, ఓడరేవులు, ఇనుము, ఉక్కు, అల్యూమినియం, రెవిన్యూ, రక్షణ, శాంతిభద్రతలు, విద్యా, వైద్యం, పోస్టల్, టెలికం లాంటి అనేక ప్రజా సర్వీసులు ఇలా అనేక రంగాలను ప్రభుత్వం నిర్వహించింది. వీటితో పాటు ప్రాజెక్టులు, మందులు, ఎరువుల పరిశ్రమలను ప్రభుత్వమే స్థాపించింది. బ్యాంకు, ఇన్సూరెన్స్‌లను జాతీయం చేసుకుంది. వీటన్నిటివల్ల స్థిరమైన వేతనాలు, చౌకగా విద్య, వైద్యం, రవాణా, గృహ వసతి లాంటి సదుపాయాలు పొందిన మధ్యతరగతి విస్తరించింది. వారి కొనుగోలు శక్తి పెరిగింది. ఇందుకు అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడం కాకుండా దిగుమతి చేసుకోవడంతో 1990 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. దీనికి పరిష్కారం సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలను ఆచరించడమేనని గత ముప్పై సంవత్సరాలుగా పాలకులు చెబుతూ వచ్చారు. నేడు మధ్యతరగతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ మూడు విధానాలే కారణం. 1991 తర్వాత అనుసరించిన ఆర్థిక విధానాల వల్ల ఈ తరగతి వేగంగా విస్తరించింది. ఈ తరగతి అభివృద్ధిలో అప్పటి వరకు కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరిస్తూ, ప్రైవేటు రంగంలోని సర్వీసు రంగాల లాంటి వాటి ద్వారా అభివృద్ధి సాధించాలనుకోవడం ఇందులోని తీవ్ర వైరుధ్యం. కొత్త రంగాల్లో వేతనాల్లో పెరుగుదల వున్నప్పటికీ అంతకు ముందు పొందిన అనేక రకాల సేవలు, భద్రత సదుపాయాలు కోల్పోయారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ఈ నయా మధ్యతరగతిలో విపరీతమైన వస్తు వ్యామోహాన్ని పెంచాయి. భద్రతతో కూడిన స్థిరమైన ఆదాయం లేకుండానే కృత్రిమ వినిమయంతో, అలవాట్లను మార్చగలిగాయి. తమను తాము ఉన్నత తరగతివారు ఏడు రూపాల్లో ప్రదర్శించుకుంటున్నారని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అవి, అవసరాలతో సంబంధం లేకుండా కొత్త వస్తువులను యథేచ్ఛగా కొనడం, ఆధునిక గృహ నిర్మాణాలు, అందులో అతి ఖరీదైన వస్తువులు ఏర్పాటు చేయడం పెరిగింది (హౌసింగ్ రుణాలు 2023లో 37.9 శాతం నుండి 2024లో 41, 2025 మొదటి అర్ధ భాగంలో 43.5 శాతానికి పెరిగాయి.). దేశీయ, విదేశీ విహారయాత్రలు, ఖరీదైన బ్రాండ్ వస్తువులు, దుస్తులు, కార్లు కొనడం, రెగ్యులర్‌గా హోటళ్లకు, రెస్టారెంట్లకు వెళ్లడం హోదాగా భావించడం, ఆధునిక వంటలు, ఖరీదైన విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చడం, మర్యాదల పేరుతో పెళ్ళిళ్లు, రకరకాల ఫంక్షన్‌లకు భారీగా ఖర్చులు చేసే సంస్కృతి పెరిగింది. వీరి వల్ల నగరాలు, పట్టణాల్లో రియల్ ఎస్టేట్ రంగంతో పాటు, కార్పొరేట్ విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, వాహనాల షోరూంలు ఈ కాలంలో బాగా విస్తరించాయి. వీటన్నింటికి అవసరమైన డబ్బును వేతనాల ద్వారా పొందలేరు కాబట్టి సులభంగా రుణాలు ఇచ్చే పద్ధతులను ఫైనాన్స్ సంస్థలు అనుసరించాయి. వ్యక్తిగత జీవిత అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. వ్యసనాలు కూడా హోదాగా మారాయి. కుటుంబ విలువలుగా ఇన్నేళ్లు కీర్తించబడినవన్నీ ఛిద్రం అవుతున్నాయి.

అమెరికాలో 2008లో ప్రారంభమై ప్రపంచమంతా విస్తరించిన ఆర్థిక సంక్షోభం, ఆ తర్వాత కరోనాతో ఈ కృత్రిమ వినిమయానికి బ్రేకులు పడ్డాయి. గతంలో పొందిన వేతనాలు తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే 23 శాతం మందికి వేతనాలు తగ్గినట్లు వినిమయ సర్వే సంస్థలు ప్రకటించాయి. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ నివేదిక ప్రకారం, ఆర్థిక మందగమనం మూడు రూపాల్లో స్పష్టంగా వ్యక్తమవుతుందని తెలిపింది. ఒకటి సాంకేతిక అభివృద్ధి (ఎ.ఐ), రెండు తీవ్రమవుతున్న ఆర్థిక మాంద్యం, మూడు క్షీణిస్తున్న ఆదాయం. ఇప్పుడు ఆటోమేషన్, టెక్నాలజీ ద్వారా అనేక ఉద్యోగాలు భర్తీ చేయబడుతున్నాయి.

కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో క్లరికల్ పోస్టులు గణనీయంగా తగ్గాయి. ఔట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వంటి వాటికి ఖర్చు తగ్గించాలని యాజమాన్యాలు తీసుకున్న చర్యల వల్ల అనేక మందికి ఉపాధి తగ్గిపోయిందని జాతీయ గణాంక కమిషన్ మాజీ చైర్మన్ పి.సి మోహన్ పేర్కొన్నారు. దేశ వినిమయంలో కీలకమైన ఐటి రంగంలోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్ళకు గురౌతున్నారు. వేతనాల పెరుగుదల సరిగా లేకపోవడం, ఉద్యోగాల తొలగింపు,గతంలో వున్న కొద్దిపాటి ఆరోగ్య, రుణ సదుపాయాల వంటివి రద్దు కావడం, పని గంటలు పెంచాలనే యాజమాన్య డిమాండ్‌లతో వీరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ దగ్గరవున్న కొద్దిపాటి డబ్బును గతంలాగా ఖర్చు చేయడానికి సిద్ధపడడం లేదు. బ్లూవెంచర్స్ సంస్థ దేశంలోని 30 కోట్ల మంది మధ్యతరగతి వారు తమ డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నారని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా వున్న మధ్యతరగతి ఇంత ఒత్తిళ్ళను ఎదుర్కొంటుంటే దేశ పాలకుల్లో కనీస చలనం వున్నట్లు కనిపించడంలేదు. దేశానికి వినాశకరమైన రెండు విధానాలను అనుసరిస్తున్నారు.ఒకటి, కార్మిక చట్టాలను కాలరాచి, సహజ వనరులను, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, రెండు, వీటిని ప్రశ్నించకుండా ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టడం. వీటిని ప్రశ్నించకుండా దేశాభివృద్ధి గురించి మాట్లాడలేం.



తుంపర సేద్యం..

# మెట్ట రైతుకు లాభం..

- డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై రైతుల ఆసక్తి
- అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారుల
- సూచన సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు, శ్రమ ఆదా..

**హుస్నాబాద్: వ్యవసాయరంగంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటి వనరులు ఉన్న హుస్నాబాద్ వంటి మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, తుంపర సేద్యం వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్ల) ద్వారా రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.**

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొ చ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

**తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు:** తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600ల వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలను నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి.

**స్ప్రింక్లర్ల అమరికలో మూడు విధానాలు:** స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకునే అవకాశం ఉంది. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం అయితే కొన్ని పైపులను మాత్రం భూమి లోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చుకోవడం రెండో విధానం. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఈ విధానం ద్వారా పైపులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించి వీలైనన్నీ పంటలకు తుంపరసేద్యం ద్వారా నీరందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైనది స్ప్రింక్లర్ హెడ్. ఇందులో రెండు రంధ్రాలు ఉంటాయి. ఒకటి 4 నుంచి 5.6మిల్లీమీటర్ల సైజు ఉండగా ఇంకోటి 3.13 మిల్లీమీటర్ల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసం గల భూమిని మాత్రమే తడుపుతుంది.

**బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే లాభాలు:** తుంపర సేద్యం విధానంలో పంట పొలంలో పొలం గట్లు, కాల్వలు, మడులు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో రైతుకు ఉన్న భూమి విస్తీర్ణం మొత్తం పంట సాగు చేయవచ్చు. సంప్రదాయ నీటి పారకం విధానంతో పొలం గట్లు, కాల్వ గట్లకు సుమారు 35శాతం నీరు వృథాగా పోతుంది. స్ప్రింక్లర్ల వాడకంలో ఈ నష్టం ఏమాత్రం ఉండదు. రైతు సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి. స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా భూమి లోపలి పొరల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. ముఖ్యంగా ఇసుక నేలల్లో ఈ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఇవ్వొచ్చు. స్ప్రింక్లర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది. తుం పర సేద్యం ద్వారాఎగుడు, దిగుడుగా ఉన్న నేలల్లోనూ పంటలు పండించొచ్చు. స్ప్రింక్లర్ ద్వారా నీరు వర్షంలా పడటంతోపంటచుట్టుపక్కల వాతావరణం చల్లగా మారిఅధిక ఉష్ణోగ్రతలనుంచి పంటను కాపాడుకోవచ్చు. డ్రిప్ సిస్టం ద్వారా పలు రకాల పండ్లతో టలను విరివిగా పెంచుకునే అవకాశం ఉంది. బిందు సేద్యం(డ్రిప్) వల్ల 30నుంచి 40శాతం కరెంట్, 30నుంచి 40 శాతం ఎరువులు ఆదా అవుతాయి. ఎత్తు పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకుఒకే మోతాదులో నీరు అందడం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది. బిందుసేద్యంతో భూమి కోతకు గురికాకుండా, భూసారం కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఉంటుంది.



# చేయూత నిలిపివేత..

**బీఆర్ఎస్ తీసుకొచ్చిన పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం!**

**ఆర్థిక ఇబ్బందుల్లో చేనేత కార్మికులు**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** చేనేత కార్మికుల ఆర్థిక స్వాలంబన కోసం గత ముఖ్యమం త్రి కేసీఆర్ ఎంతో పరితపించారు. వారి కోసం 'చేనేతకు చే యూత' పేరుతో అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపారు. కానీ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని నీరుగార్చింది. స్కీమ్‌ను నిలిపివేసి నేతన్నల కడుపుకొట్టింది. వారిని ఆర్థిక సమస్యల ఊబిలో పడేసింది. ఫలితంగా మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.

**గడువు ముగిసినా తిరిగి ప్రారంభించలే..:** గత 36 నెలలుగా దిగ్విజయంగా కొనసాగిన చేయూత పథకం గడువు ముగిసినా.. ఇంత వరకు ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రా రంభించలేదు. అదేమని అడిగిన నేత కార్మిక సంఘాల నాయకులకు చేదు అనుభవమే మిగిలింది. తప్పని పరిస్థితుల్లో నిరసన కార్యక్రమా లకు దిగిన నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కత్తి కడుతోంది. కనీసం ఈ పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారన్న డిమాండ్‌కు ప్రభుత్వంలో చలనం కూడా లేకుండా పోయిందనే అభిప్రాయాలను నేత కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. చేయూత పథకాన్ని కొనసాగించాలని, తమ బతుకులను బాగుచేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర రావును కలిసినా.. ఫలితం లేదని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తంచేశారు.

**అర్ధాంతరంగా నిలిపివేత..:** వాస్తవానికి 'చేనేత చేయూత' పథకం అ ద్భుతమైంది. ఓనేత కార్మికుడు ప్రతి నెలా బ్యాంకులో రూ.1000 జ మ చేస్తే.. దానికి ప్రభుత్వం రూ.2000 కలిపి మొత్తాన్ని తిరిగి నేత కార్మికుడి ఖాతాలో జమ చేయడం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకంతో ఆర్థికంగా చితికపోయిన నేతన్నలకు ఆర్థిక పరిపుష్టి లభించింది. వారి ఆనందం ఎంతోకాలం నిలువలేదు. కాంగ్రెస్ అధికారంలోకివచ్చి వారి బతుకులను ఆగం చేసింది. చేయూత పథకాన్ని అర్ధాంతరంగా నిలిపి వేసింది. దీంతో నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పథకం కింద నేత కార్మికులు గత 36 నెలలపాటు రూ.1000 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇ లా రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లను కేటాయించి తిరిగిరెన్యువల్ చేయాల్సిఉండగా, ప్రభు త్వం ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

# టీడీపీ కేడర్ లో నిస్తేజం!

**నెల్లూరుతెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు ఏపీ పాలిటిక్స్ లో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటు న్నారు. నాలుగు దఫాలుగా ముఖ్యమంత్రిగా చేసినా ఎన్నడూ లేని సమస్యలను ఆయన ఎదుర్కొంటున్నారు. అదే సొంత పార్టీ క్యాడర్ నుంచే. ఇటీవల తెలు గుదేశం పార్టీ సభ్యత్వాలు కోటికి చేరడంతో సంతోషించే సమయం లోనే మరొక వైపు సోషల్ మీడియాలో సొంత పార్టీ క్యాడర్ పెడుతున్న పోస్టింగ్ లను చూసి టీడీపీ అగ్రనాయకత్వం ఇబ్బందులను ఎదుర్కొం టుంది. 1995 నుంచి ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. చంద్రబాబు నాయుడు సహజంగా ఏ నిర్ణయమైనా నేతలతో అంటే పొలిటి బ్యూరో చర్చించి తీసుకుంటారు. ప్రజాస్వామ్య యుతంగానే నిర్ణయాలు ఉ ంటాయని ఆయన చెబుతారు.. కానీ ఈసారి మాత్రం ఏ నిర్ణయం తీసుకున్నా విపక్ష నేతలు వైసీపీ సోషల్ మీడియా పరిస్థితి ఎలా ఉ న్నప్పటికీ టీడీపీ సోషల్ మీడియా నుంచే ఘాటు కామెంట్స్ విన పడుతున్నాయి. ప్రతి నిర్ణయాన్ని క్యాడర్ పోస్టుమార్టం చేసేస్తుంది. నామినేటెడ్ పోస్టుల భర్తీ నుంచి వైసీపీ నేతలపై యాక్షన్ లేకపోవడం వరకూ అన్నింటా టీడీపీ కార్యకర్తలు పార్టీ అగ్రనాయకత్వానికి దిశానిర్దేశం చేస్తుంది. ఇంత వరకూ కొడాలి నాని, వల్లభనేని వంశీని ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ రోజుకు ఒకసారైనా క్యాడర్ సోషల్ మీడియాలో నిలదీస్తుంది. తమను ఐదేళ్ల కాలంలో ఆ పార్టీ నేతలు అంత ఇబ్బందులు పెట్టినా ఇప్పుడు చూసీ చూడనట్లు వదిలేయడమేం టని నిలదీస్తున్నారు. దీనికి నేతలు సమాధానం చెప్పలేక చేతులెత్తేస్తున్నారు.. ఇక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల విషయాలను కూడా టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు వదిలిపె ట్టడం లేదు. ఎవరిమీదనైనా సరే నెగిటివ్ కామెంట్స్ పెట్టేస్తున్నారు. టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే చాలు వెంటనే టీడీపీ సోషల్ మీడియాలో దానికి సంబంధించిన పోస్టింగ్ లు కనపడుతుండటంతో పార్టీ అధినాయకత్వాన్నికలవరానికి గురి చేస్తున్నాయి.

గతంలో ఎన్నడూ లేని పరిస్థితి ఇప్పుడు ఉందని పార్టీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గాల్లో జనసేన నేతల జోక్యాన్ని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే బీజేపీ నేతలను కూడా టీడీపీ సోషల్ మీడియా వదిలిపెట్టడం లేదు. దీంతో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని అంటున్నారు.. మరొక వైపు క్యాడర్ నుంచి బలమైన ఫీడ్ బ్యాక్ వచ్చే అవకాశముందని భావిస్తు న్నప్పటికీ తమ సొంత సోషల్ మీడియా ప్రత్యర్థి పాత్ర పోషించడం కొంత ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబునాయుడు, లోకేష్ వంటి నేతల నిర్ణయాలను కూడా కడిగిపారేస్తున్నారు.

# కేసులతో విలవిలలాడుతున్న లీడర్స్

**కాకినాడ, తెలంగాణ దిశ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఇప్పుడు మాట్లాడేందుకు ఎవరు బయటకు వస్తున్నారు అని చూస్తే.. కళ్ల ముందు ఒక్క అంబటి రాంబాబు మాత్రమే కనిపిస్తున్నారు. అప్పుడ ప్పుడూ రోజా వస్తున్నారు. మహిళల్ని అరెస్టు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారన్న విషయం బయటకు వచ్చిన తర్వాత ఆమె ఎక్కువగా మీడియా ముందుకు వస్తున్నారు. అయితే మిగతా అగ్రనేతలు ఎవరూ ప్రభుత్వంపై పోరాటానికి ముందుకు రావడం లేదు. చివరికి విజయసాయిరెడ్డి వంటి నేతలు రాజకీయ సన్యాసం ప్రకటించేస్తు న్నారు. దీనంతటికి కారణం హైకమాండ్ అండగా ఉంటామన్న భరోసా ఇవ్వకపోవడమేనని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. పేర్ని నాని గతంలో తరచుగా మీడియా ముందుకు వచ్చేవారు. ఇప్పుడు ఆయన కూడా కనిపించడం లేదు. ఆయనపై బియ్యం మాయం కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసుల్లో కిందా మీదా పడి ఆయన కుటుం బం అరెస్టు కాకుండా రక్షించుకునేందుకు ఎవరికీ కనిపించకుండా తిరిగారు. ఎలాగోలా అరెస్టు నుంచి రక్షణ పొందినా ఆయన మీడియా ముందుకు రావడం లేదు. నియోజకవర్గంలో పెద్దగా తిరగడం లేదు. ఒక్క పెద్దిరెడ్డి కాదు శ్రీకాకుళంలో ధర్మాన దగ్గర నుంచి కడపలో శ్రీకాంత్ రెడ్డి వరకూ అందరూ వీలైనంత వరకూ మౌనం పాటిస్తున్నారు. దీంతో వైసీపీ పూర్తి స్తబ్దతగా మారిపో యిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. దీనంతటికి కారణం అధికారం పోవడం వల్ల వచ్చి పడిన ఒత్తిళ్లే. అధికారంలో ఉన్నప్పుడు చేసిన కొన్ని కార్యకలాపాల వల్ల ఇప్పుడు వారు ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. పార్టీ ముఖ్యనేతలు కేసుల పాలైనా పార్టీ నుంచి సహకారం అందకపోవడం చాలా మంది సీనియర్ నేతల్ని కూడా అసంతృప్తికి గురి చేస్తోందని చెబుతున్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్.. అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయన ఐదు నెలల పాటు జైల్లో ఉ న్నారు. మొదట్లో ఆయనకు మద్దతుగా వైసీపీ నుంచి కాస్త సహకారం లభించినప్పటికీ తర్వాత వారు కూడా పట్టించుకోలేదు. చివరికి నందిగం సురేష్ భార్య పోరాడి ఎలాగోలా బెయిల్ తెచ్చుకున్నారని చెబుతున్నారు. బెయిల్ పై నందిగం సురేష్ బయటకు వచ్చే సమయంలో గుంటూరు జిల్లాకు చెందిన ఒక్క వైసీపీ నేత కూడా ఆయనకు స్వాగతం చెప్పేందుకు రాలేదు. దీంతో ఆయన హతాశుడయ్యారు. రాజకీయ పరమైన కేసు అని ప్రజల్లోకి వెళ్లాలంటే పార్టీ సపోర్టు ఉండాలని లీడర్లు కోరుకుంటారు.కానీ పార్టీ సపోర్టు లేకపోవడంతో వారు వీలైనంత వరకూ సైలెంట్ గా ఉండాలని అనుకుంటున్నారు. లీడర్లతో పాటు క్యాడర్ కూడా సమస్యల్లో ఉంది. పార్టీ అధికారం పోయిన వెంటనే చాలా మంది సోషల్ మీడియా కార్యకర్తలు అకౌంట్లను డీయాక్టివేట్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లారు.

# ఇక అంతా ఆయనేనా?

**ఒంగోలు, తెలంగాణ దిశ :** వైసీపీలో నెంబరు టూ అనుకునే వారంతా వరసగా వెళ్లిపోతున్నారు. జగన్ పార్టీని వీడి సీనియర్ నేతలు వెళ్లిపోతుం డటంతో ఇక నెంబరు 2 స్థానం ఎవరిదన్న దానపై ఆసక్తికరమైన చర్చ మొదలయింది. మొన్నటి వరకూ విజయసాయిరెడ్డి వైసీపీలో నెంబరు టూ గా వ్యవహరించారు. ఆయనను కొద్దికాలం క్రితం జగన్ ఉత్తరాంధ్రకు ఇన్ ఛార్జిగా కూడా నియమించారు. అయితే ఆయన రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఇప్పుడు జగన్ ఎవరి మీద ఎక్కువ ఆధారపడతారన్న దానిపై చర్చ జరుగుతుంది. సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నప్పటికీ ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఆయన ప్రభుత్వ సలహాదారుగానే పనిచేశారు.. జగన్ చెప్పిన పనిని చేయడమే సజ్జల రామకృష్ణారెడ్డి చేసేవారు. జగన్ ఆదేశాలను అమలు చేసేంత వరకే సజ్జల పని. అంతకు మించి జగన్ వద్ద ఫ్రీగా మాట్లాడేందుకు కూడా ఆయనకు అవకాశం లేదన్నది అందరికీ తెలిసిందే. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి కొంత ఇబ్బంది పడుతున్నారు. ఆయనపై వరసగా కేసులు కూడా నమోదయ్యాయి. సకల శాఖ మంత్రిగా ఆయన నాడు పేరు పొందడంతో ప్రస్తుత అధికార పార్టీకి లక్ష్యంగా మారడంతో ఆయన కొంత దూరంగా ఉంటూ వస్తున్నారు. రేపు ఎన్నికల సమయం వరకూ సజ్జల రామకృష్ణారెడ్డి యాక్టివ్ అయ్యే అవకాశాలు ఎంత మాత్రం లేవన్నది స్పష్టంగా తెలుస్తోంది. ఇక మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి సయితం వైసీపీని వదిలి జనసేన పార్టీలోకి వెళ్లిపోయారు. జగన్ కు దగ్గర బంధువు కావడంతో ఆయనకు కొంత ఫ్రీ హ్యాండ్ ఉండేది. ప్రకాశం జిల్లాలో ఆయన చెప్పిన వారికే 2014 నుంచి 2024 వరకూ జరిగిన ఎన్నికల్లో అనేక నియోజకవర్గాల్లో జగన్ టిక్కెట్ ఇచ్చారంటారు. ఆయన సిఫార్సుకు అంత వాల్యూ జగన్ ఇచ్చేవారు. అదే సమయంలో జగన్ కు బాబాయి అయిన వైవీ సుబ్బారెడ్డి ప్రకాశం జిల్లాలో చేయి పెట్టడానికి వీలయ్యేది కాదు. ఎందుకంటే బాలినేని, వైవీ సుబ్బారెడ్డికి మధ్య పొసగేది కాదు. అందుకే జగన్ వైవీ సుబ్బారెడ్డికి రెండుసార్లు టీటీడీ ఛైర్మన్ పదవి ఇచ్చి ఆధ్మాత్మిక కార్యక్రమాలకే పరిమతం చేశారంటారు. ఇక ఇప్పుడు విజయసాయిరెడ్డి పార్టీలో లేరు. బాలినిని జనసేనలో ఉన్నారు. ఇక అంతా వైవీ సుబ్బారెడ్డిదే అన్న టాక్ నడుస్తుంది. జగన్ వద్ద స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పేందుకు వైవీ సుబ్బారెడ్డికి మాత్రమే అవకాశం ఉండటంతో ఆయనకు ఇక పార్టీలో ప్రయారిటీ పెరుగుతుందంటున్నార. పైగా జగన్ ఆయనకు రాజ్యసభ పదవి కూడా ఇవ్వడంతో ఢిల్లీలో కూడా లాబీయింగ్ చేయడానికి కీలకంగా మారనున్నారు. అందుకే ఇప్పుడు వైసీపీలో వైవీ హవా నడుస్తుందన్న వాదన బలంగా పార్టీ వర్గాల్లో వినిపిస్తుంది. వైవీ సుబ్బారెడ్డి అన్నింటా జగన్ కు అండగా ఉండటంతో ఆయనకే ప్రయారిటీ లభిస్తుందని భావించి ఎక్కువ మంది నేతలు ఆయన చుట్టూ చేరుతున్నారట.

# ఎన్నాళ్లీ డోలీమోతలు?



ఒక దేశం అభివృద్ధి చెందటం అంటే ఏమిటి? విద్య, వైద్యం, నివాసం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలు అందరికీ అందుబాట్లో ఉ ండడం. వీటి లేమి కారణంగా ఏ ఒక్కరూ జీవనానికి ఇబ్బంది పడకుండా బతకడం. కానీ, ఆచరణలో మన అభివృద్ధి అత్యంత అసమంగా ఉంది. కనీస సదుపాయాలు కనీసంగా కూడా అందుబాట్లో లేక మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో, మారుమూల మైదాన గ్రామాల్లో అత్యవసర వైద్య సేవల కోసం జనం అల్లాడిపోతున్న దీనస్థితి దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. డోలీల్లో కూర్చోబెట్టుకొని గర్భిణీలను, బాలింతలను మోసుకొస్తున్న హృదయవిదారక దృశ్యాలు తరచూ చోటు చేసుకోవడం%ొ% డెబ్బరు ఐదేళ్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు వేస్తామని, డోలీ మోతల అవసరం లేకుండా చేస్తామని మూడు నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ఇంకా మాట దశలోనే ఉంది. ఈలోగానే ఉత్తరాంధ్రలో ఆరేడు డోలీమోతల సంఘటనలు వెలుగు చూశాయి. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి మండలం గూనలంక గ్రామానికి చెందిన గర్భిణీ పురిటినొప్పులు పడుతున్న సమయంలో కుటుంబ సభ్యులు ఆమెని ఎనిమిది కిలోమీటర్ల దూరం డోలీలో మోసుకు రావాల్సి వచ్చింది. కొండదారిని దాటి, రోడ్డుకు వచ్చాక అక్కడి నుంచి అంబులెన్సులో చింతపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్చటం, అక్కడ సహజ ప్రసవం జరిగి, తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడం కొంత ఉపశమనం. ఏ సామాజిక, ఆర్థిక తరగతికి చెందిన తల్లికయినా బిడ్డకు జన్మనివ్వడం అనే ప్రక్రియ ప్రాణాంతకంగా మారకూడదు. ఎప్పుడేం జరుగుతుందోన న్న నరకయాతనకు గురి కాకూడదు. కానీ, కొండ ప్రాంతపు గిరిజన తల్లులకు ప్రసవవేదన ప్రాణం పోయేంత దారుణంగా మారిపోతోంది. వైద్యసేవలు అందుబాట్లో లేక, సహజ ప్రసవం జరగక, అత్యవసర స్థితి ముంచుకొచ్చిన సమయంలో మండల కేంద్రాల్లోని ప్రభుత్వాసు పత్రులకు తోడ్కొని పోవటమే పెద్ద గండంగా పరిణమిస్తోంది. నొప్పులు పడుతున్న గర్భిణీకి ఆ పరిస్థితే మహా నరకయాతన. అలాంటి స్థితిలో డోలీలో వేసుకొని, ఎగుడు దిగుడు దారుల్లో, రాళ్లూ రప్పల తోవల్లో, ఎండో వానో చలో వెంటాడే సమయాల్లో తరలించటం ఎంత దుర్భరం! ఎంత దయనీయ దుఃఖభరిత సందర్భం! ఈ దృశ్యాన్ని, దుఃఖాన్ని ఊహించుకుంటేనే మనసు విచలితమైపోతోంది. గిరిజన తల్లులు దశాబ్దాలు తరబడి ఈ బాధనీ, భయాన్ని అనుభవిస్తున్నారు. అనేక వందల సార్లు ఈ అసహాయ స్థితి, ఆర్తనాదమూ పాలకుల దృష్టికి వచ్చినా, చెవికి సోకినా పరిస్థితిని మార్చటానికి చేసింది దాదాపు శూన్యం. దేశంలో ఇప్పటికీ ఏటా 24 వేల మంది తల్లులు ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోతుండగా, అందులో అత్యధికులు కొండిపాంత నివాసితులే! రెక్కాడితేనే కానీ డొక్కాడని పేద తల్లులే! ప్రతి వెయ్యి మంది నవజాత శిశుమరణాల్లో దేశం సగటు 26 అయితే, 25 మరణాలతో మన రాష్ట్రం 23వ స్థానంలో ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దుకోవటానికి పాలకులు చాలా చర్యలు చేపట్టాల్సి ఉంది. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు మెరుగుపర్చాలంటే– మైదాన ప్రాంతాల వలె జనాభా సంఖ్యనో, జనసాంద్రతనో పరిగణనలోకి తీసుకోకూడదు. నివాస ప్రాంతాల భౌగోళిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రాథమిక వసతులు కల్పించాలి. సురక్షిత నీరు లేక, పోషకాహారం అందక అతిసార, విషజ్వరాలు వంటి సాధారణ జబ్బులకు గురై ఏటా వందలాది మరణాలు గిరిజన ప్రాంతాల్లో సంభవిస్తున్నాయన్న వాస్తవాన్ని గుర్తెరగాలి. అప్పటికప్పుడు గంభీరమైన ప్రకటనలు చేసి, ఆ తరువాత మరచిపోయే ధోరణికి పాలకులు స్వస్తి చెప్పాలి. మన్యంలో డోలీ మోతలు లేని విధంగా అన్ని చర్యలూ తీసుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. హెల్దీ, వెల్దీ, హ్యాపీ స్వర్ణాంధ్రను సాధిస్తామని చంద్రబాబు 2047 విజన్ పత్రంలో స్వప్నావిష్కరణ చేశారు. ఆ కల సంగతి తరువాత. ముందు తగినన్ని నిధులు కేటాయించి, డోలీ మోతల్లేని, అకాల మరణాలు లేని స్థితిని సాధించాలి. నెలకొకసారి ఏజెన్సీలో బస చేసి, సమస్యలను పరిష్కరిస్తానని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆ దిశగా చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. కేంద్రంలోని బిజెపి రకరకాల పేర్లతో గిరిజన ప్రాంతాల్లో మతోన్మాదం చొప్పించే ప్రణాళిక మీద ఎక్కువ శ్రద్ధ చూపుతుంది తప్ప– గిరిజనుల విద్య, వైద్యారోగ్యాల గురించి, కనీస సదుపాయాల కల్పన గురించి పట్టించుకోవటం లేదు.

# పదవుల భర్తీలో ఆలస్యంతో నైరాశ్యం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** పదేళ్లు పోరాడం. పొద్దున లేస్తే రోడ్డు మీదే ఉన్నాం. ఇప్పుడు పార్టీ పవర్‌లోకి వచ్చింది న్యాయం జరుగుతుం దని అనుకున్నాం. ఏడాది అవుతుంది. ఇప్పటివరకు ఓ గుర్తింపు లేదు. పదవి లేదు. అంటూ గునుక్కుంటున్నారట కాంగ్రెస్ నేతలు. ఇంకో నెల అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో క్యాబినెట్ విస్తరణ జరగలేదు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులను కూడా మొత్తం భర్తీ చేయలేదు. ఇలా పదవుల భర్తీలో ఆలస్యం అవుతుండటంతో నేతల్లో నైరాశ్యం కనిపిస్తోందట. పార్టీ కోసం ఎంత మొత్తుకుని ఏం లాభం అంటూ నింటూర్పుతో ఉన్నారు కొందరు నేతలు.రోజులు గడుస్తున్నా పదవుల భర్తీకి సర్కారు పెద్దలు పచ్చజెండా ఊపకపోవడంతో లీడర్లు ఢీలా పడుతున్నారు. పూర్తిస్థాయి క్యాబినెట్ విస్తరణపై చాలాసార్లు కసరత్తు చేసినా..ముందడుగు పడటం లేదు. సీఎంతో సహా 11మంది మంత్రులతోనే ఇప్పుడు ప్రభుత్వం నడుస్తోంది. మిగతా ఆరు బెర్తుల కోసం తక్కువలో తక్కువ 20మంది ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు. అందుకోసం సీఎం రేవంత్‌తో పాటు ఢిల్లీ స్థాయిలో కూడా పైరవీలు చేస్తున్నారట. అయితే అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో మంత్రివర్గ విస్తరణ జరగడం లేదు. నేతల అమాత్య ఆశలు నెరవేరడం లేదు. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను భర్తీ చేయడానికి చాలా సమస్యలు ఉన్నాయంటున్నారు. ఉమ్మడి జిల్లాల వారిగా ప్రాతినిధ్యంతో పాటు సామాజిక సమీకరణాలను కూడా బేరీజు వేసుకుంటున్నారు. ఇవేవీ కొలిక్కి రాకపోవడంతో పార్టీ అధిష్టానం వాయిదా వేస్తూ వస్తోందిఇక కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీది అదే పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రకటించి ఆ తర్వాత మూడు నెలలకు గానీ జీవోలు ఇవ్వలేదు. ఇప్పటికీ ఇంకా 40 శాతం ఛైర్మన్ పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అవి ఎప్పుడు భర్తీ చేస్తారా అని నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో..కార్పొరేషన్ ఛైర్మన్ పదవి అయినా ఇస్తారా లేకపోతే తమ సంగతి ఇంతేనా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట నేతలు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం చాలామంది నేతలు గాంధీభవన్‌తో పాటు సీఎం, మంత్రుల చుట్టూ తిరుగుతున్నారుఎవరి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నేతలంతా నీరసించి పోతున్నారు. కార్పొరేషన్ ఛైర్మన్లకు క్యాబినెట్ విస్తరణకు ముడిపడి ఉండటంతో.. వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఇక వ్యవసాయ మార్కెట్ కమిటీలది అదే పరిస్థితి. ఇప్పటివరకు సగం మార్కెట్లకే కమిటీలు వేశారు. మిగతావి అన్ని పెండింగ్‌లోనే ఉ న్నాయి. ఇలా ఇంకా చాలా పోస్టుల భర్తీని పెండింగ్‌లోనే ఉంచారు ప్రభుత్వ పెద్దలు. పదవులు భర్తీ చేయకపోవడంతో పార్టీ కోసం పనిచేసిన నేతలు..సీట్లు త్యాగం చేసినవారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన తమకు మొండి చెయ్యి చూపిస్తున్నారని పార్టీ నేతలతో పాటు, ద్వితీయ శ్రేణి లీడర్లు అసహనం వ్యక్తం చేస్తున్నా రు. ప్రభుత్వం వచ్చి ఇన్ని నెలలు అవుతున్నా పదవుల భర్తీకి ఆలస్యం ఎందుకు అవుతుందో కనీసం సీనియర్లు అయినా క్లారిటీ ఇవ్వాలంటు న్నారు. ఇలాఅయితే పార్టీ కోసం పనిచేయడం ఎలా అని ప్రశ్నిస్తున్నార ట. త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు,మున్సిపల్ ఎన్నికల కోసం పనిచేయాలంటే పదవులు ఇవ్వాలంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా పదవి లేకుండా పని చేయమనడం ఎంతవరకు సాధ్యం అవుతుందని పీసీసీ పెద్దలను నిలదీస్తున్నారట పార్టీ నేతలు.


# చురుగ్గా విమానాశ్రయ రహదారి పనులు

**భోగాపురం, తెలంగాణ దిశ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళేం దుకు అవసరమైన అప్రోచ్ రోడ్డు రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి 6కిలో మీటర్లు వరకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో చురుగ్గా సాగుతున్నాయి. మిగతా రహదారికి సంబంధించి పరిహారం విషయంలో విశాఖ భూసేకరణ ట్రిబ్యునల్ కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. విమానాశ్రయానికి జాతీయ రహదారి నుంచి వెళ్ళేందుకు ఉప్పాడపేట జంక్షను వద్ద నిర్మించనున్న ట్రంపెట్ నుంచి వెళ్లాలి. కానీ ఏ.రావివలస రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ ట్రంపెట్ సమీపంలో ఇంకా రైతులకు పరిహారం ఇవ్వకపోవడంతో దీనికి 500 మీటర్లు దూరం నుంచి ప్రస్తుతం రోడ్డు పనులు సాగుతున్నాయి. అక్కడ నుంచి ఆరు కిలో మీటర్లు వరకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో ఇటీవలి ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. 200 అడుగుల వెడల్పుతో రహదారి: జాతీయరహదారి నుంచి 500 మీటర్లు దూరం విడిచిపెట్టి అక్కడ నుంచి విమానాశ్రయానికి వెళ్ళేందుకు ప్రస్తుతం రహదారి పనులు జరుగుతున్నాయి. కెపిసి అనే నిర్మాణ సంస్థ ఈ పనులను చేపడుతోం ది. 22 మీటర్లు అంటే 200 అడుగుల వెడల్పుతో నాలుగులైన్లతో ఈ రహదారి పనులు జరుగుతున్నాయి. స్థానికుల వాహనాలు అటూ ఇటూ వెళ్ళే విధంగా అక్కడక్కడ అండర్‌పాస్‌లను సైతం నిర్మిస్తున్నారు. ఏ.రావివలస జగనన్న కాలనీ, గూడెపువలస మూడుగుళ్ళు సమీపంలో, పలుచోట్ల అండరర్ పాస్‌లు నిర్మాణం జరుగుతున్నాయి. ప్రస్తుతం మట్టి పనులు జోరందుకున్నాయి. అవసరమైన చోట కల్వర్టులను సైతం నిర్మిస్తున్నారు. ఇదే రహదారికి గూడెపువలస రెవెన్యూ పరిధిలో 20 ఎకరాలకు రైతుల నుంచి అనుమతి లభించింది.

ఇటీవలి ఈ 20 ఎకరాలకు అవార్డ్ కూడా పాస్ చేశారు. విశాఖ ట్రిబ్యునల్ కోర్టులో కేసు పరిష్కారం కావడంతో త్వరలో రైతుల ఖాతాలోకి పరిహారం పడుతుందని గూడెపువలస

గ్రామ సర్పంచ్ మట్టా ఆయ్యప్పరెడ్డి సమక్షంలో రైతులకు ఆర్‌డిఓ దాట్ల కీర్తి చెప్పడంతో రైతులు సమ్మతించారు. ఈ 20 ఎకరాల్లో కూడా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

# ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్త కుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి.

ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా..

ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం



మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం. కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్న వారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్నునొప్పి, తుంటి నొప్పి ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవన శైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.


మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కం దరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండ రం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రొజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది.

స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరా లను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్'అంటారు. ఆట లు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.



అరికాళ్లలో నొప్పి:అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి)ని 'ప్లాంటార్‌ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడ టం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు.

కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతు ంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి.

అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్స్‌రే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూ నొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

# నారి నారి నడుమ సరాగాలు...




హీరో శర్వానంద్ నటిస్తున్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త మీనన్, సాక్షి విద్య కథానాయికలు. రామ్ అబ్బరాజు దర్శకుడు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మాతలు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావచ్చింది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్ట నున్నారు. ఏప్రిల్ 7న 'దర్శనమే..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలిపాటను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ పోస్టర్‌లో శర్వానంద్, సంయుక్త రొమాంటిక్ మోడ్‌లో బైక్ రైడ్‌ని ఆస్వాదిస్తూ కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, మాటలు: నందు సవిరిగాన, కెమెరా జ్ఞానశేఖర్ వి.ఎస్, యువరాజ్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, సహనిర్మాత: అజయ్ సుంకర, నిర్మాణం: ఏకె ఎంటైర్టైన్మెంట్స్, అడ్వంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్.

# రీఎంట్రీ బాలయ్య సినిమాతోనే?




ఎన్టీఆర్ బయోపిక్స్ కథానాయకుడు, మహానాయకుడు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరవయ్యారు బాలీవుడ్ నటి విద్యాబాలన్. ఆ చిత్రాల్లో ఆమె ఎన్టీఆర్ సతీమణి బసవతారం పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ తెలుగు తెరపై విద్యాబాలన్ కనిపించలేదు. అయితే.. మళ్లీ ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారనేది లేటెస్ట్ న్యూస్. అది కూడా బాలయ్య సినిమాతోనేనట. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ 'అఖండ' సీక్వెల్ 'అఖండ – తాండవం' షూటింగ్‌లో బాలయ్య బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో విద్యాబాలన్ ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఇందులో కథ రీత్యా ఓ పవర్‌ఫుల్ పొలిటికల్ లీడర్ పాత్ర ఉందట. ఆ పాత్రకోసం విద్యాబాలన్‌ని బోయపాటి సంప్రదించారనీ, కథ, పాత్ర విన్న తర్వాత ఆమె చేయడానికి అంగీకరించారని సమాచారం. స్టార్‌హీరోయిన్ విద్యాబాలన్‌తో ఆ పాత్ర చేయిస్తున్నారంటే.. కచితంగా కథలో కీలకమైన పాత్రే అయ్యుంటుదని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఇందులో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు విద్యాబాలన్ కూడా తోడవ్వడంతో.. 'అఖండ–తాండవం' చిత్రానికి బాలీవుడ్‌లోనూ క్రేజ్ ఏర్పడటం ఖాయం అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బేబీ బిజీ బిజీ..



'బేబీ'.. అనగానే ముందు గుర్తొచ్చే రూపం వైష్ణవి చైతన్య. ఆ ఒక్క సినిమాతో రెండు తెలుగురాష్ట్రాల యువతనీ తనవైపు తిప్పుకున్నది ఈ అచ్చతెలుగందం. దీపం ఉండగానే ఇల్లు చక్కబె ట్టుకునే తత్వం కాదు వైష్ణవి చైతన్యది. 'బేబీ' తర్వాత సినిమాలు క్యూ కట్టినా.. ఆచితూచి అడుగులు వేస్తూ.. నచ్చిన పాత్రలనే ఎంచుకుంటూ ఓ ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నది ఈ అందాలభా మ. సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా ఆమె నటించిన 'జాక్' సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినం చేయస్తున్నట్టు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక హీరోయిన్‌కి ద్విపాత్రాభినయం చేసే అవకాశం రావడం అరుదే. ఆ అరుదైన ఛాన్స్‌ని వైష్ణవి కొట్టేసింది. ఈ సినిమా తర్వాత సూపర్‌హిట్ వెబ్‌సిరీస్ '90 ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమాలో ఆనంద్ దేవరకొండకు జోడీగా వైష్ణవి నటించనున్నది. సితార ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇలా బడా సంస్థలు నిర్మిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ బిజీబిజీగా ఉన్నది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ తెలుగమ్మాయి ఓ ఫొటోషూట్‌లో పాల్గొన్నది. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ కూడా చేసింది. ఈ ఫొటోల్లో యువరాణిలా మెరిసిపోతున్న వైష్ణవి చైతన్యను చూడొచ్చు.

# నిరాశపర్చిన రష్మిక సికిందర్



ఈ మధ్య కాలంలో సల్మాన్ ఖాన్ మూవీకి ఇంత తక్కువ ఓపెనింగ్స్ రావడం ఇదే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. సల్లూభాయ్ గత చిత్రాలు "బజరంగీ భాయీ జాన్, కిక్, దబాంగ్, టైగర్ జిందా హై, సుల్తాన్, భరత్, ప్రేమ్ రతన్ ధన్ పాయో, ఏక్ థా టైగర్, టైగర్ – 3" చిత్రాలకు ఇంతకంటే మంచి ఓపెనింగ్స్ వచ్చాయంటున్నారు. సల్మాన్ తోటి హీరోలు చాలామంది ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరితే సల్మాన్ మాత్రం ఆ విషయంలో వెనకబడి పోయారంటున్నారు. షారుఖ్ ఖాన్ 'పఠాన్, జవాన్' చిత్రాలతోనూ, రణబీర్ కపూర్ 'యానిమల్'తోనూ, సన్నీ డియోల్ 'గద్దర్ –2'తో, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంతో రూ. 500 కోట్ల మైలురాయిని దాటేశారు. చివరకు గత యేడాది వచ్చిన హారర్ మూవీ 'స్త్రీ –2' సైతం రూ. 500 కోట్ల కబ్‌లో చేరిపోయింది. కానీ సల్మాన్ ఇంకా ఆ మ్యాజిక్ ఫిగర్ ను అందుకోలేకపోతున్నారు. విశేషం ఏమంటే రశ్మిక మందణ్ణ ఇప్పటికే ఆ మైలురాయిని మూడు చిత్రాలతో దాటేసింది. ఆమె నటించిన 'యానిమల్, పుష్ప –2, ఛావా' లు రూ. 500 కోట్ల కబ్ల్ లో చోటు సంపాదించుకున్నా యి. కానీ ఇప్పుడీ 'సికందర్' మాత్రం రూ. 500 కోట్ల గ్రాస్ ను దాటడం కష్టమనే అంటున్నారు. ఆదివారంతో పోల్చితే... సోమవారం ఈద్ పండగ సెలవు కాబట్టి కొంత కలెక్షన్స్ పెరిగే ఛాన్స్ లేకపోలేదు. అయితే పులి మీద పుట్రలా ఇప్పటికే ఈ సినిమా ఆన్ లైన్ లో పైరసీ అయి చక్కర్లు కొడుతోందని బాలీవుడ్ వర్గాలు మొత్తుకుంటున్నాయిస్టార్ హీరోయిన్ రశ్మిక మందన్నా కెరీర్ అప్రతిహతంగా సాగిపోతోంది. వరుస విజయాలతో ముందుకు పోతున్న రశ్మికకు ఆ మధ్య వచ్చిన 'గుడ్ బై', 'మిషన్ మజ్ను' వంటి సినిమాలు నిరాశకు గురి చేశాయి. అయితే.. 2023 చివరిలో వచ్చిన రణబీర్ కపూర్ 'యానిమల్'తో మళ్ళీ ఒక్కసారిగా రశ్మిక మందణ్ణ కెరీర్ ఊపందుకుంది. ఆతర్వాత యేడాది 2024 డిసెంబర్‌లో వచ్చిన 'పుష్ప–2' ఆ యేడాది అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన మూవీగా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో వచ్చిన 'ఛావా' సినిమా జాతీయ స్థాయిలో రశ్మిక మందణ్ణకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టేలా చేసింది. ఆ రకంగా రశ్మిక హ్యాట్రిక్ ను సాధించింది. సల్మాన్‌ఖాన్ మూవీ 'సికందర్' ఆమెను తీవ్ర నిరాశకు గురి చేసింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215